

జేవీ విధానంలోనే మెట్రో



అన్ని నగరాల మాదిరిగానే విజయవాడ మెట్రో కూడా..

- కేంద్రం 20 శాతం, రాష్ట్రం 20 శాతం వాటా
- మిగిలిన 60 శాతం వాటా థర్డ్‌పార్టీ నుంచి అప్పుగా..
- మెట్రో ప్రాజెక్టుపై స్పష్టతనిచ్చిన కేంద్రం

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : విజయవాడ మెట్రో రైల్ ప్రాజెక్టును జాయింట్ వెంచర్ (జేవీ) విధానంలోనే ముందుకు తీసుకెళ్లాలని కేంద్రం నిర్ణయించింది. విజయవాడ మెట్రో ప్రాజెక్టుకు నూరుశాతం కేంద్రం భరించాలని ఏపీఎంఆర్‌సీ, రాష్ట్ర ప్రభుత్వం సంయుక్తంగా కేంద్రానికి విజ్ఞప్తి చేసిన సంగతి తెలిసిందే. దేశంలోని అన్ని నగరాలకు ఏ విధంగా మెట్రో ప్రాజెక్టులను ఇచ్చామో, అలాగే విజయవాడ, విశాఖకు కూడా వర్తిస్తుందని కేంద్రం స్పష్టం చేసింది. దీంతో భాగస్వామ్య విధానంలోనే మెట్రో ప్రాజెక్టుకు అడుగులు పడుతున్నాయి. జాయింట్ వెంచర్ విధానంలో ప్రాజెక్టు వ్యయంలో కేంద్ర ప్రభుత్వం 20 శాతం, రాష్ట్ర ప్రభుత్వం 20 శాతం వాటాలు భరించాల్సి ఉండగా, మిగిలిన 60 శాతం మిగతా 4లో..



అందంగా ముస్తాబైన రాయనపాడు శాటిలైట్ రైల్వేస్టేషన్

రాయల్‌గా రాయనపాడు

- సకల సదుపాయాలతో శాటిలైట్ రైల్వేస్టేషన్
- పూర్తయిన తొలిదశ అభివృద్ధి, ఆధునికీకరణ
- వెస్ట్ బైపాస్ మీదుగా రాజధానికి దగ్గరి దారి

6లో



నందివాడ మండలం పెదలింగాలలో డ్రెయినేజీ నుంచి తవ్విన మట్టి తరలింపు

మట్టి కొట్టేస్తున్నారు

జిల్లాలో మట్టి మాఫియా దందా కొనసాగుతోంది. అధికార పార్టీ నాయకులుగా ముసుగేసుకున్న కొందరు ప్రతిపక్ష నాయకులతో కలిసి మట్టిని అక్రమంగా తవ్వేసి వ్యాపారం జోరుగా సాగిస్తున్నారు. అదేమని ఎవరైనా ప్రశ్నిస్తే దాడులకు తెగబడుతున్నారు. పంటపొలాలు, డ్రెయినేజీలు, డొంకరోడ్లను సైతం తవ్వేసి, మట్టిని తరలించి కోట్ల రూపాయలు దండుకుంటున్నారు. జిల్లావ్యాప్తంగా మట్టిని భారీగా తరలిస్తున్నా అధికారులు చూసీచూడనట్టుగా వ్యవహరిస్తున్నారు.

జిల్లావ్యాప్తంగా మట్టి అక్రమ తవ్వకాలు.. విక్రయాలు

అధికార, ప్రతిపక్ష నాయకుల కనుసన్నల్లో రాత్రిపూట తవ్వకాలు

- పసుమర్రులో 18 ఎకరాల చెరువును చెరపట్టిన అక్రమార్కులు
- ఇదేమని ప్రశ్నిస్తున్న గ్రామస్థులు, రైతులపై దాడులు
- మామూళ్ల మత్తులో అటువైపు చూడని అధికారులు

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : పామర్రు మండలం పసుమర్రులో 18 ఎకరాల విస్తీర్ణంలో తాగునీటి చెరువు ఉంది. ఈ వేసవిలో ఆ చెరువును ఎండగట్టారు. గ్రామంలోని పాఠశాలను, ఇతరత్రా పల్లపు ప్రాంతాలను మెరకచేసే పేరుతో ఇటీవల ఈ చెరువు నుంచి మట్టి తవ్వకాలను ప్రారంభించారు. భారీగా యంత్రాలను ఏర్పాటుచేసి మట్టిని విజయవాడ, ఉయ్యూరు, పామర్రు తదితర ప్రాంతాలకు తరలించి రూ.కోట్లు వెనకేసుకుంటున్నారు. పసుమర్రు పంచాయతీలో వివిధ ప్రాంతాలను మెరక చేస్తున్నట్టుగా తెరపై చూపి, ఇక్కడ ఆ పనులు చేయకుండా ఇతర ప్రాంతాలకు మట్టిని రాత్రి సమయంలో టిప్పర్ల ద్వారా తరలిస్తున్నారు. స్థానికంగా ఎవరైనా మట్టిని కొంటే ట్రాక్టర్ రూ.700, పక్కగ్రామంలో రూ.1,200, దూరప్రాంతాలైతే ఒక టిప్పర్‌కు రూ.4 వేల చొప్పున మట్టిని విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఇక్కడి మట్టి తవ్వకాలను పర్యవేక్షిస్తున్న మధ్యవర్తులు తమకు ఓ ట్రాక్టరుకు రూ.400 చొప్పున కమీషన్ ఇచ్చి, మీ ఇష్టం వచ్చిన ధరకు మట్టిని విక్రయించుకోవాలని ట్రాక్టర్, టిప్పర్ యజమానులకు భరోసా ఇస్తున్నారు. పసుమర్రు గ్రామానికి చెందిన ఓ కీలక నాయకుడు.. ప్రతిపక్ష నాయకుల కనుసన్నల్లో ఈ మట్టి అక్రమ రవాణా మిగతా 4లో..

పెదపారుపూడి, గుడివాడ మండలాల్లో..

గుడివాడ మండలం వలివర్తిపాడు, బొమ్ములూరు, లింగవరం తదితర ప్రాంతాల్లోని పంటపొలాలను తవ్వేసి మట్టిని విక్రయించే పనులు వారం రోజులుగా ఊపందుకున్నాయి. పెద్దఎత్తున ట్రాక్టర్ల ద్వారా మట్టిని తరలిస్తున్నారు. అయినా అధికారులు తమకేమీ తెలియనట్టుగా వ్యవహరిస్తున్నారు. నందివాడ మండలం పెదలింగాల ఆత్కూరు డ్రెయిన్‌లో వైసీపీ నాయడొకరు మట్టిని తవ్వి దర్జాగా విక్రయిస్తున్నాడు. అయినా అధికారులు ఆ వైపునకు కన్నెత్తి చూడట్లేదు. ఈ మట్టి అక్రమ రవాణాపై టీడీపీ నాయకులు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడం గమనార్హం. పెదపారుపూడి మండలం బేతవోలు-పెదపారుపూడి సరిహద్దున ఉన్న డొంకరోడ్డును తవ్వి స్థానిక గ్రామ ప్రజాప్రతినిధి యథేచ్ఛగా మట్టిని విక్రయిస్తున్నాడు. డొంకరోడ్డును తవ్వేస్తే భారీ వర్షాలు కురిసిన సమయంలో వందలాది ఎకరాల పంట పొలాలు ముంపుబారిన పడతాయని పెదపారుపూడికి చెందిన బెనర్జీ అనే రైతు ప్రశ్నించినందుకు సదరు ప్రజాప్రతినిధి అతనిపై దాడి చేయడం గమనార్హం.

చాటింగ్.. డేటింగ్.. జంపింగ్

పోలీసుల అదుపులో ఘరానా మోసగాడు



నాగతేజ

- నగర యువతితో చాటింగ్.. డేటింగ్ ప్రపోజల్
- ఏకాంత సమయంలో చేతులు, కాళ్లు కట్టేసి బంగారంతో జంప్
- గతంలోనూ ఇద్దరిని మోసంచేసిన హైదరాబాద్ యువకుడు
- దొంగిలించిన డబ్బుతో క్రికెట్ బెట్టింగ్‌లు

జల్సాలకు అలవాటు పడ్డాడు.. క్రికెట్ బెట్టింగులకు బానిసయ్యాడు.. డబ్బు కోసం అడ్డదారులు తొక్కాడు.. డేటింగ్ యాప్‌లో రిజిస్టర్ అయ్యాడు.. యువతులకు వల విసిరేవాడు.. హాయ్.. అంటూ మాట కలిపేవాడు.. తొలుత కొంత నగదు వారికి పంపించేవాడు.. యువతులకు నమ్మకం కుదిరాక వారితో సన్నిహితంగా ఉండేందుకు కొంత మొత్తంలో ఆఫర్ చేసేవాడు.. ఏకాంతంగా ఉన్న సమయంలో ఉండగా బంగారం, నగదుతో ఉడాయించేవాడు. చిన్న వయస్సులోనే ఘరానా దొంగతనాలకు పాల్పడుతున్న ఓ యువకుడిని పోలీసులు హైదరాబాద్‌లో అదుపులోకి తీసుకున్నారు.

విజయవాడ, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్‌లోని ప్రగతి నగర్‌కు చెందిన కిలారు నాగతేజ (23) బీటెక్ మూడో సంవత్సరం మధ్యలోనే మానేశాడు. తల్లిదండ్రులు వంట పనిచేస్తూ జీవిస్తున్నారు. వీరి స్వగ్రామం బాపట్ల కాగా, 20 ఏళ్ల క్రితం హైదరాబాద్‌కు వలస వెళ్లిపోయారు. చెడు వ్యసనాలకు అలవాటు పడిన నాగతేజ అడ్డదారులు తొక్కాడు. డేటింగ్ యాప్‌లు, ఇన్‌స్టాలోనూ యువతులతో చాటింగ్ చేసి మోసానికి తెరతీసేవాడు. అలాగే, ఈనెల 22న మాచవరం పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఓ హోటల్‌కు నగరానికి చెందిన యువతితో వెళ్లాడు. ఏకాంత సమయంలో ఆమె చేతులు, కాళ్లు కట్టేశాడు. అనంతరం ఆ యువతికి చెందిన 20 గ్రాముల బంగారాన్ని, కొంత నగదు తీసుకుని ఉడాయించాడు. అనంతరం ఆ బంగారాన్ని నగరానికి చెందిన ఓ వ్యక్తికి విక్రయించి గుంటూరుకు చేరుకున్నాడు. అక్కడి నుంచి హైదరబాద్‌కు రైల్లో వెళ్లిపోయాడు. బంగారం అమ్మగా వచ్చిన నగదుతో ఐపీఎల్ క్రికెట్ బెట్టింగ్‌లు ఆడాడు. ఈ ఘటన వివరాలు తెలుసుకున్న మాచవరం పోలీసులు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి రెండు రోజులుగా ఇన్‌స్టాగ్రామ్ ఐడీతో పాటు మెయిల్ ఐడీ ద్వారా జల్లెడ పట్టారు. చివరికి నాగతేజ ఆచూకీ హైదరాబాద్‌లో ఉందని తెలిసింది. శుక్రవారం నాగతేజను అదుపులోకి తీసుకున్నారు. కాగా, గతంలో హైదరాబాద్‌కు చెందిన ఇద్దరు యువతులను మోసంచేసి నగదుతో పారిపోయిన ఇతను చర్లపల్లి జైల్లో శిక్ష కూడా అనుభవించాడు.

పాకిస్తానీయులు జిల్లాను వీడి వెళ్లాలి

కలెక్టర్ బాలాజీ ఆదేశాలు

మచిలీపట్నం, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : పాకిస్తాన్ దేశానికి చెందిన వారి వీసాలను కేంద్ర ప్రభుత్వం రద్దు చేసిందని, ఆ దేశానికి చెందినవారు ఎవరైనా జిల్లాలో ఉంటే వెంటనే వారి దేశానికి వెళ్లిపోవాలని కలెక్టర్ బాలాజీ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. భారత ప్రభుత్వం జారీచేసిన దౌత్య, దీర్ఘకాలిక వీసాలు ఈనెల 27 వరకు, వైద్య వీసాల గడువు ఈనెల 29 వరకు మనుగడలో ఉంటాయని పేర్కొన్నారు. గడువు తీరాక ఆ దేశస్తులు జిల్లాలో ఉండటానికి అనుమతులు ఉండవని తెలిపారు. కాబట్టి వివిధ రకాల వీసాలపై జిల్లాలో ఉంటున్నవారు నిర్దేశించిన సమయంలోగా వారి దేశానికి వెళ్లిపోవాలని కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు.



రహదారులపై ఏర్పాటు చేసిన పూల మొక్కలు

చకచకా

- అమరావతిలో ఘనంగా ప్రధాని సభా ఏర్పాట్లు
- తుదిదశకు చేరుకున్న మూడు వేదికలు
- ఆకర్షణీయంగా వీఐపీ మార్గాలు
- రోడ్డు షో జరిగే దారిలో ఆకట్టుకునే లైటింగ్

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : వచ్చేనెల 2వ తేదీన అమరావతి పునర్నిర్మాణ శంకుస్థాపన సభా ఏర్పాట్లు తుదిదశకు చేరుకున్నాయి. వేదిక పనులు దాదాపు పూర్తి కావచ్చాయి. గ్యాలరీలతో పాటు మూడు వేదికలు పూర్తయ్యాయి. కూటమి పార్టీల కలయికకు చిహ్నంగా గ్యాలరీ వేదికల లోపలి భాగంలో పసుపు, ఎరుపు, కాషాయం రంగులతో అలంకరిస్తున్నారు. పార్కింగ్ ప్రదేశాల నుంచి సభాస్థలికి వెళ్లే ప్రాంతాల్లో రోడ్ల పనులు చేపట్టారు. రోడ్ల వెంబడి ఆకర్షణీయమైన మొక్కలు నాటుతున్నారు. వీఐపీ మార్గంలో అందమైన పూలకుండీలు ఏర్పాటు చేస్తున్నారు. తబలా ఆకారంలోని పూలకుండీలు ఆకర్షిస్తున్నాయి. ప్రధాని రోడ్డు షో నిర్వహించే దగ్గర లైటింగ్‌ను అధికారులు పరిశీలించారు.



సిద్ధమవుతున్న సభా వేదిక

నేడు మత్స్యకారుల సేవలో.. అందజేత

మచిలీపట్నం, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : చేపలవేట నిషేధ సమయంలో మత్స్యకారులకు ఇచ్చే 'మత్స్యకారుల సేవలో..' శనివారం అందజేయనున్నట్లు ఆ శాఖ జేడీ టి.నాగరాజు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో 13,077 మంది మత్స్యకారులకు ఒక్కొక్కరికీ రూ.20 వేల చొప్పున రూ.26.15 కోట్లను లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్ల మండలం బుడగాట్లపాలెంలో ప్రారంభమవుతుందని, ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు పాల్గొంటారని ఆయన తెలిపారు. జిల్లా కేంద్రమైన మచిలీపట్నంతో పాటు కృత్తివెన్ను, నాగాయలంక, కోడూరు మండలాల్లో జూమ్ మీటింగ్ ఏర్పాటు చేశామని, వీటిలో మత్స్యకారులు పాల్గొనాలని ఆయన కోరారు.

సరదాలో విషాదం

మోపిదేవిలో రోడ్డు ప్రమాదం ● ఇద్దరు స్నేహితులు దుర్మరణం



సుధాకర్ (ఫైల్)



బాలభాస్కర్ (ఫైల్)

మోపిదేవి, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : మోపిదేవి వార్పు వద్ద, టోల్‌ప్లాజా సమీపంలో గురువారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో యాస బాలభాస్కర్ (21), బంతుల సుధాకర్ (18) అనే ఇద్దరు యువకులు మృతిచెందారు. మరో ఇద్దరికి గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన సమాచారం మేరకు.. అవనిగడ్డకు చెందిన బాలభాస్కర్, సుధాకర్, గౌతమ్, యువతేజ స్నేహితులు. సరదాగా చల్లపల్లి వరకు వెళ్లి, బిర్యానీ తినొద్దామని గురువారం సాయంత్రం బయల్దేరారు. బిర్యానీ తిని ఇంటికి తిరిగి వస్తుండగా, మోపిదేవి వార్పు వద్ద ఉన్న టోల్‌ప్లాజా దాటాక ఎదురుగా ఓ కంటైనర్ వచ్చి వీరిని ఢీకొట్టింది. ముందు ఉన్న లారీని ఓవర్ టేక్ చేస్తూ వచ్చి వీరి బైకులను ఢీకొంది. ఒక ద్విచక్ర వాహనంపై ఉన్న భాస్కర్, సుధాకర్ అక్కడికక్కడే మృతిచెందారు. మరో ద్విచక్రవాహనంపై ఉన్న ఇద్దరికి గాయాలయ్యాయి. గ్రామస్థులు ఇచ్చిన సమాచారంతో క్షతగాత్రులను అంబులెన్స్‌లో అవనిగడ్డ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుడివాడ ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ సస్పెన్షన్

విధులకు రాకుండా హాజరైనట్టు సంతకాలు చేసినందుకే..



ఇందిరాదేవి (ఫైల్)

గుడివాడ, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : గుడివాడ ఏరియా ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ ఇందిరాదేవిని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ సస్పెండ్ చేశారు. విధులకు హాజరు కాకుండానే హాజరైనట్టుగా రిజిస్టర్‌లో సంతకాలు చేసినట్లు అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) ప్రాథమిక విచారణలో తేలడంతో ఈ మేరకు చర్యలు తీసుకున్నారు. ఇందిరాదేవి విధులకు హాజరుకాకుండానే రిజిస్టర్‌లో సంతకం చేస్తున్నారని ఓ వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా డీఎస్‌హెచ్ ఉన్నతాధికారులు విచారణ చేపట్టారు. గత ఏడాది జనవరి-మార్చిలో పలు విడతల్లో 22 రోజుల పాటు ఆమె విధులకు హాజరు కాలేదని తేలింది. ఆయా రోజుల్లో ఇందిరాదేవి సంతకాలతో పాటు ముఖ ఆధారిత విధానం (ఎఫ్ఆర్ఎస్) ద్వారా కూడా హాజరు నమోదు చేసినట్లు గుర్తించారు. ఎఫ్ఆర్ఎస్ ద్వారా ఆయా రోజుల్లో సూపరింటెండెంట్ మచిలీపట్నంలో ఒకరోజు, తణుకులో 8 రోజులు, విశాఖపట్నంలో 13 రోజులున్నట్లు నిర్ధారణ అయ్యింది. దీనిపై ఇందిరాదేవి.. రాష్ట్ర వైద్యశాఖ అధికారులకు ఇచ్చిన రాతపూర్వక వివరణ సమంజసంగా లేకపోవడంతో ఆమెను సస్పెండ్ చేస్తూ రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ ఆదేశాలిచ్చారు. హాజరు పర్యవేక్షణలో అలసత్వం వహించిన అప్పటి డీసీహెచ్ఎస్, నామమాత్రంగా విచారణ చేపట్టిన అప్పటి జిల్లా డీఎం అండ్ హెచ్‌వోపై కూడా తగు చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు.

కేసరపల్లిలో దొంగల హల్‌చల్

- రూ.30 లక్షల ఆభరణాలు చోరీ
- ఇంట్లో ఎవరూ లేని సమయంలో దొంగతనం

4లో

వృద్ధురాలి అనుమానాస్పద మృతి కేసు

వీడిన మిస్టరీ

- యనమలకుదురులో వృద్ధురాలిని అంతమొందించిన మహిళ, ఆమె స్నేహితుడు
- మృతురాలి కొడుకును మెదక్‌లో హత్య చేసిన నిందితులు
- కొడుకు ఆచూకీపై ప్రశ్నించడంతో వృద్ధురాలిని కూడా..
- పెనమలూరు పోలీసుల అదుపులో నిందితులు

6లో

విద్యుదాఘాతంతో యువకుడు మృతి

- కూలర్‌లో నీరు పోస్తుండగా ఘటన
- పది రోజుల్లో పెళ్లింట విషాదం
- వత్సవాయిలో ఘటన

4లో

ఎన్నారైల జోలికొస్తే ఖబడ్దార్!

» జగన్ రెడ్డి అండ్ బ్యాచ్‌పై కేశినేని శివనాథ్ ఆగ్రహం

» పెట్టుబడులు పెట్టే వారికి అండగా ఉంటానని భరోసా


కేశినేని శివనాథ్

వన్‌టౌన్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టే ఎన్నారైలకు తాను భరోసాగా ఉంటానని.. వారిజోలికి ఎవరైనా వస్తే ఖబడ్దార్ అంటూ విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) హెచ్చరించారు. శుక్రవారం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన జగన్ అండ్‌కోపై తీవ్ర విమర్శలు గుప్పించారు. రాష్ట్రానికి పెట్టుబడులు వస్తుంటే మాజీ సీఎం, ఎమ్మెల్యే జగన్ రెడ్డి వికృత చేష్టలకు తెరలేపారన్నారు. ఎన్నారైలు ఎవరూ అధైర్యపడవద్దని, ప్రభుత్వం వారికి అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. సూట్‌కేస్ కంపెనీల వ్యక్తుల మాటలను నమ్మవద్దని చెప్పారు. పెట్టుబడులు పెట్టేందుకు వస్తున్న ఎన్నారైలపై అసత్య ఆరోపణలు చేస్తూ జగన్ బ్యాచ్ వెనక్కి పంపేందుకు కుట్ర పన్నుతున్నారన్నారు. రాష్ట్రానికి పరిశ్రమలు రావాలని, పెట్టుబడులు తీసుకురావాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో ప్రజా ప్రతినిధులందరూ కృషి చేస్తుంటే జగన్ మాత్రం తన డ్రామాలతో అవి వెనక్కి వెళ్లిపోయేందుకు చూస్తున్నాడన్నారు. ఉర్సా సంస్థ సీఈవో సతీష్ క్లౌడ్, ఏఐ టెక్నాలజీ నిపుణుడిగా ఉన్నారని, ఆయన కంపెనీలో ప్రమోటర్లకు రూ.3,700 కోట్లకు పైగా నెట్‌వర్క్ ఉందని, అటువంటి వ్యక్తి డేటాసెంటర్ పెట్టేందుకు ముందుకు వస్తే 99 పైసలకే స్థలం ఇచ్చామని జగన్ రెడ్డి బ్యాచ్ విషప్రచారం చేస్తున్నదని, దమ్ముంటే ఆధారాలు చూపాలని సవాల్ విసిరారు. ఎన్నారైలను విమర్శించటం సిగ్గుచేటన్నారు. తనపై ఎలాంటి రాజకీయ విమర్శలు చేసినా ఊరుకుంటాను గాని, పెట్టుబడులు పెట్టేందుకు వచ్చే ఎన్నారైలను భయపెట్టాలని చూస్తే సహించేది లేదన్నారు. పెట్టుబడుదారుల జోలికి, ఎన్నారైల జోలికి వస్తే సహించేది లేదని హెచ్చరించారు.

సీఎం బాబు దృష్టికి జిల్లా సమస్యలు

» రోడ్డు కనెక్టివిటి, తాగు, సాగునీటిపై నెట్టెం వినతి


చంద్రబాబుకు సమస్యలు వివరిస్తున్న నెట్టెం రఘురాం

జగ్గయ్యపేట, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో పలు సమస్యలపై ప్రత్యేకంగా ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసి విజయవాడ పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు నెట్టెం రఘురాం విజ్ఞాపన పత్రం అందజేశారు. గురువారం ఆయన వెలగపూడి సచివాలయంలో ప్రత్యేకంగా కలిశారు. జిల్లాలో జగ్గయ్యపేట సమీపంలో కాలం చెల్లిన పాలేటి బ్రిడ్జిపై హైలెవెల్ బ్రిడ్జి నిర్మాణానికి అనుమతి ఇవ్వాలని, ముక్త్యాల-మాదిపాడు మధ్య కృష్ణానదిపై నిర్మిస్తున్న బ్రిడ్జికి ఖమ్మం-విజయవాడల మధ్య నిర్మిస్తున్న హైవేకు, గుంటూరు జిల్లాలో మద్దిపాడు నుంచి సత్తెనపల్లి వద్ద హైవేకు అనుసంధానం చేయాలని, తద్వారా అంత రాష్ట్ర రవాణా మరింత పెరగటంతో పాటు సరిహద్దు గ్రామాలకు అమరావతి రాజధానికి రవాణా సౌకర్యం ఏర్పడుతుందని వివరించారు. నవ్యాంధ్ర ఏర్పడిన తొలి ఐదేళ్లలో శంకుస్థాపన చేసిన ముక్త్యాల ఎత్తిపోతల పథకాన్ని కూటమి ప్రభుత్వం కొనసాగించి, తిరిగి అంచనాలు వేసి ప్రారంభించాలన్నారు. సమస్యలపై సీఎం సానుకూలంగా స్పందించారని నెట్టెం చెప్పారు.


నిరసన కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి నాదెండ్ల మనోహర్

భద్రత విషయంలో రాజీపడం : నాదెండ్ల

విజయవాడ, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : ఉగ్రవాదులు అమాయక పౌరులను లక్ష్యంగా చేసుకుని దాడులు చేయడం దుర్మార్గమని జనసేన ఎమ్మెల్యే, మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పిలుపు మేరకు మూడు రోజులు రాష్ట్ర వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ, బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని, జనసేన పార్టీ రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి నియోజకవర్గంలోని ప్రజల్లో చైతన్యం తీసుకురావడానికి కృషి చేస్తోందని తెలిపారు. ప్రజల భద్రత విషయంలో ప్రభుత్వం రాజీ పడదని, నిఘా వర్గాల సమాచారం మేరకు తగిన చర్యలు తీసుకుంటామని మంత్రి తెలిపారు. ఇలాంటి ఘటనలు జరిగినప్పుడు మనమంతా ఐక్యంగా ఉండాలని, భారతీయులుగా బాధితులకు భరోసా కలిగించాలని అన్నారు. నిరసనలో సామినేని ఉదయభాను, అమ్మిశెట్టి వాసు, మండలి రాజేష్ తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ పీవీ రామారావు

ఆంధ్ర హాస్పిటల్స్‌లో 15 మంది పిల్లలకు

విజయవంతంగా గుండె శస్త్ర చికిత్సలు

గవర్నర్‌పేట, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్ర హాస్పటల్స్‌లో హీలింగ్ లిటిల్ హార్ట్స్, యూకే చారిటీ సౌజన్యంతో 34వ ఉచిత పిల్లల గుండె సర్జరీల క్యాంపు ఏప్రిల్ 21 నుంచి 25 వరకు నిర్వహించినట్టు హాస్పిటల్స్ చీఫ్ ఆఫ్ చిల్డ్రన్ సర్వీసెస్ అండ్ డైరెక్టర్ డాక్టర్ పీవీ రామారావు తెలిపారు. శుక్రవారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, డాక్టర్ బీఆర్ జగన్నాథ్, ఉష శెట్టి, అశ్విని కుమార స్వామి (బెంగళూరు), డాక్టర్ నాగేశ్వరరావు (ఆంధ్ర హాస్పిటల్స్, విజయవాడ) బృందం 15మంది పిల్లలకు గుండె శస్త్రచికిత్సలు నిర్వహించినట్టు తెలిపారు. అత్యంత క్లిష్టమైన గుండె జబ్బులు టెట్రాలజీ ఆఫ్ ఫాలో, డివోఆర్‌వి, ఇతర క్లిష్టమైన గుండె ఆపరేషన్లు జరిగాయని వెల్లడించారు. ఆంధ్ర మదర్ అండ్ చైల్డ్ ఫౌండేషన్, మహేష్‌బాబు ఫౌండేషన్, ఎన్టీఆర్ వైద్య సేవ సహకారంతో ఆపరేషన్లు విజయవంతంగా నిర్వహించిన వైద్య బృందానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో పలువురు వైద్యులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో యువకుడు మృతి

» కూలర్‌లో నీరు పోస్తుండగా ఘటన

» పదిరోజుల్లో పెళ్లి ఇంట విషాదం


కంచర్ల జితేంద్ర

వత్సవాయి, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : మరో పదిరోజుల్లో పెళ్లి బాజాలు మోగనున్న ఆ ఇంట విషాదం చోటు చేసుకుంది. వివాహం కావాల్సిన సమయంలో విద్యుదాఘాతానికి గురై యువకుడు మృతి చెందిన ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. తాళ్లూరి గ్రామానికి చెందిన కంచర్ల వెంకటకృష్ణ-భూలక్ష్మి దంపతులకు ఒక్కడే కొడుకు. తండ్రి రెండేళ్ల క్రితం మృతిచెందగా కొడుకు కంచర్ల జితేంద్ర (25) ఆటోలో ఉల్లిపాయల వ్యాపారం చేసుకుంటూ తల్లిని పోషిస్తున్నాడు. గురువారం రాత్రి ఇంట్లోని కూలర్‌లో నీళ్లు పోస్తూ విద్యుత్‌షాక్‌కు గురై మృతి చెందాడు. మరో పదిరోజుల్లో అతడికి బంధువుల అమ్మాయితో వివాహం జరగాల్సి ఉంది. ఇంతలోనే అతను మృతి చెందడంతో కుటుంబసభ్యులు శోక సంద్రంలో మునిగిపోయారు. ఎమ్మెల్యే శ్రీరామ్ రాజగోపాల్ మృతుడి కుటుంబసభ్యులను పరామర్శించారు.

ధాన్యం కొనుగోళ్లు చేపట్టండి

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

» ఆర్డీవో, తహసీల్దార్లతో ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ సమీక్ష

» అవకతవకలపై దృష్టి పెట్టాలని ఆదేశం


రైతులు, మిల్లర్లతో మాట్లాడుతున్న ఆర్డీవో బాలకృష్ణ

నందిగామ, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : ధాన్యం రైతుల కష్టాలు, మిల్లర్లు, దళారుల దోపిడీపై 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన 'దయనీయం' కథనానికి అధికారులు స్పందించారు. శుక్రవారం ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ ఆర్డీవోలు, తహసీల్దార్లతో సమీక్ష నిర్వహించారు. ధాన్యం కొనుగోళ్లలో అవకతవకలపై దృష్టి సారించాలని ఆదేశాలు జారీ చేశారు. కొనుగోళ్లు నిలిచిపోవడానికి కారణమైన బ్యాంక్ గ్యారెంటీలపై మరో కోటి వరకూ రాయితీని ప్రకటించారు. తక్షణమే కొనుగోళ్లు నిర్వహించాలని ఆదేశించారు. వాహనాలు సిద్ధం చేయని ట్రాన్స్‌పోర్టు కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని, అదే సమయంలో ఆర్డీవోల సహకారంతో లారీలు తెప్పించుకోవాలని సూచించారు. తొలుత తహసీల్దార్లు వాహనాలకు డీజిల్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ట్రాన్స్‌పోర్టు బిల్లులను కూడా తక్షణమే అందించేలా చర్యలు చేపడతామని సూచించారు. ఆర్డీవోలు, తహసీల్దార్లు మిల్లులు, ధాన్యం కొనుగోలు కేంద్రాలను నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. ఎక్కడ రైతుకు ఇబ్బంది జరిగినా తక్షణమే తన దృష్టికి తీసుకురావాలని ఆదేశించారు. కలెక్టర్ ఆదేశాలతో నందిగామ ఆర్డీవో కె.బాలకృష్ణ ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. డివిజన్‌లోని పలు మిల్లుల వద్దకు వెళ్లి రైతులు, మిల్లర్లతో మాట్లాడారు. మిల్లుకు వచ్చిన సరుకును ఆలస్యం లేకుండా దిగుమతి చేసుకోవాలని సూచించారు. పీపీసీల ద్వారా కాకుండా నేరుగా రైతుల వద్ద తక్కువ ధరకు మిల్లర్లు కొనుగోలు చేసినట్టు తెలిస్తే క్రిమినల్ చర్యలు సైతం తీసుకోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. రైతుల వద్ద ధాన్యం పూర్తిగా కొనుగోలు జరిగే వరకూ కొనుగోళ్లపై నిఘా ఉంటుందని హెచ్చరించారు.

కొనుగోళ్ల మాటేమిటి..!

జిల్లాలో మొత్తం 1.66 లక్షల టన్నుల ధాన్యం నిల్వలు ఉన్నాయి. జిల్లా పౌరసరఫరాల శాఖ కేవలం 50 వేల టన్నుల కొనుగోలుకు మాత్రమే సిద్ధంగా ఉంది. జిల్లాలో మొత్తం 27 మిల్లులు ఉండగా, వాటిలో 17 మిల్లులు మాత్రమే కొనుగోళ్లు చేస్తున్నాయి. వీటిలో ఆరు మిల్లులు ఉప్పుడు బియ్యం(ఎంటీయూ 1010 రకం) కొనుగోలు చేస్తున్నాయి. ఇటీవల నిబంధనలు అతిక్రమించారన్న కారణంతో రెండు మిల్లులను అధికారులు సీజ్ చేశారు. ఈ రకం బియ్యం జిల్లాలో యాభైవేల టన్నులకు పైబడి ఉంది. ఇంతపెద్ద మొత్తంలో నిల్వలను ఆ నాలుగు మిల్లులు సేకరించే అవకాశం కనిపించడం లేదు. దీంతో రైతులు తక్కువ ధరకు దళారులను ఆశ్రయించాల్సి వస్తున్నది. ఫలితంగా క్వింటాకు రూ.2320కి బదులు కేవలం రూ.1200 నుంచి రూ.1500 వరకే ధర పొందగలుగుతున్నారు. రైతులను ఆదుకోవాలంటే తక్షణం మిల్లుల సంఖ్య పెంచాల్సి ఉంది. ఇప్పటికిప్పుడు కొత్తగా మిల్లులను కల్పించే అవకాశాలు కనిపించడం లేదు. భారీఎత్తున ధాన్యం ఆడించాలంటే ఇతర రాష్ట్రాల నుంచి కార్మికులను దిగుమతి చేసుకోవాల్సి ఉంది. అధికారులు ముందస్తు ప్రణాళికలు లేక పోవడం వల్లనే ఈ పరిస్థితి వచ్చిందని, ఈక్రమంలో రైతును ఆదుకొనేందుకు ఏం చర్యలు చేపడతారో వేచి చూడాల్సిందే.

● భారీఎత్తున ధాన్యం కొనుగోళ్లు చేపట్టాల్సిన సమయంలో జాయింట్ కలెక్టర్ జనవరిలో సెలవుపై వెళ్లగా ఇంత వరకూ ప్రభుత్వం ఆ పోస్టుకు ఇన్‌చార్జిని నియమించలేదు. జేసీ ఉంటే దిగుబడుల ఆధారంగా కొనుగోళ్ల ఏర్పాట్లు సమీక్షించి ఆ దిశగా చర్యలు చేపట్టే వారు. మరో వైపు జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారులూ కార్యాలయాలకే పరమితమవడంతో క్షేత్రస్థాయిలో సమస్యలు తెలుసుకోలేకపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు తమకు అండగా నిలవాలని రైతులు కోరుతున్నారు.

తక్కువ ధరకు విక్రయించొద్దు

» పుకార్లు నమ్మవద్దు : గుమ్మడి వెంకటేశ్వరరావు

గాంధీనగర్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : రబీ ధాన్యాన్ని మద్దతు ధర కంటే తక్కువకు విక్రయించవద్దని ఏపీ రైస్ మిల్లర్ల సంఘం అధ్యక్షుడు గుమ్మడి వెంకటేశ్వరరావు రాష్ట్రంలోని రైతాంగానికి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, ప్రభుత్వ నాణ్యతా ప్రమాణాలు కలిగిన ఎఫ్. ఏక్యూ ధాన్యాన్ని ఎంఎస్‌పీ చెల్లించి కొనేందుకు రైస్ మిల్లర్లు సిద్ధంగా ఉన్నారన్నారు. ఎవరైనా మిల్లర్లు కొనుగోలు చేయకుంటే 73866 23036 నంబర్‌కు ఫిర్యాదు చేస్తే అసోసియేషన్ పరంగా చర్యలు తీసుకుంటామన్నారు. గాంధీనగర్‌లోని రైస్‌మిల్లర్ల అసోసియేషన్ హాల్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో ఆయన మాట్లాడారు. మిల్లర్లు రైతుల ధాన్యాన్ని తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారని, రబీ ధాన్యం సేకరణ నిలిపివేశారన్న పుకార్లను నమ్మవద్దని కోరారు. 75 కిలోల బస్తా ధాన్యానికి రూ.1725 మద్దతు ధరను చెల్లిస్తామన్నారు. 2024-25 రబీ కాలంలో 12 జిల్లాల నుంచి 53,890 మంది రైతుల నుంచి రూ.1318 కోట్లు చెల్లించి 5,71,109 టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్టు తెలిపారు. ధాన్యం రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వంతో పాటు రైస్ మిల్లింగ్ ఇండస్ట్రీ కూడా సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. సమావేశంలో షేక్ బాజీ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

దోపిడీ జరుగుతున్న తీరిది..

గ్రామాల్లో ధాన్యం కొనుగోలుకేంద్రాలు తేమశాతం పరీక్షించి అందుకు సంబంధించిన పత్రాలను రైతులకు అందజేస్తారు. ధాన్యాన్ని మిల్లుల వద్దకు తీసుకువచ్చిన అన్నదాతలను మిల్లర్లు వ్యూహాత్మకంగా దిగుమతి ఆలస్యం చేసి మరోమారు తేమ పరీక్షలు చేస్తున్నారు. అధిక తేమ ఉందని, నూకశాతం కూడా ఎక్కువగా ఉందని చెబుతున్నారు. కనీసం ఐదు కిలోల తారం తీస్తే తప్ప ధాన్యం కొనలేమని స్పష్టం చేస్తున్నారు. పండించిన పంట ఇళ్లలో నిల్వ ఉంచలేని స్థితితో పాటు రోజుల తరబడి మిల్లుల వద్ద వేచి ఉండటంతో విసుగు చెందిన అన్నదాతలు తెచ్చిన పంటను వెనక్కు తీసుకువెళ్లలేక మిల్లర్లకు తలొగ్గుతున్నారు. తరుగు తీసేందుకు అంగీకరిస్తున్నారు. తరుగు ద్వారా దోపిడీ చేసిన మొత్తం ధాన్యాన్ని


వర్షం భయంతో ధాన్యంపై పట్టాలు కప్పుతున్న రైతులు

మిల్లర్లు అనుచరుల పేరుతో కొనుగోలు చేసినట్టు చూపి ప్రభుత్వ మద్దతు ధరకు అమ్ముకుంటూ లబ్ధి పొందుతున్నారు. మరోవైపు పౌరసరఫరాల శాఖ అధికారుల నిర్లక్ష్యం వల్ల సకాలంలో బ్యాగ్‌లు, రవాణా వాహనాలు అందక నిస్సహాయ స్థితిలో ఉన్న రైతుల నుంచి అతి తక్కువ ధరకు ధాన్యం కొనుగోలు చేసి మద్దతు ధరకు విక్రయిస్తున్నారు. అవినీతి వెనుక అధికారుల హస్తం ఉందని, అన్నదాతను దోపిడీ చేస్తున్నా పాలకులు సైతం పట్టించుకోక పోవడం విస్మయం కలిగిస్తుందని రైతులు ఆరోపిస్తున్నారు.

సమగ్ర దర్యాప్తు జరపాలి..

మిల్లర్ల దోపిడీపై విజిలెన్స్ విచారణ జరపాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. గ్రామాల్లో వారు ప్రోత్సహిస్తున్న దళారులపైనా నిఘా పెట్టాలని కోరుతున్నారు. మిల్లర్లు, దళారులకు అనుసంధానంగా ఉంటూ ఆర్థిక లబ్ధి పొందిన అధికారులపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలంటున్నారు.

సమస్యలు పరిష్కరించరూ!

» మంత్రి రవీంద్రకు ప్రజల వినతులు


ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న మంత్రి రవీంద్ర

మచిలీపట్నం టౌన్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. శుక్రవారం టీడీపీ కార్యాలయం వద్ద ప్రజల నుంచి మంత్రి కొల్లు అర్జీలు స్వీకరించారు. చిన్నాపురం రైతులు తమ సమస్యలను వివరించారు. గుండేరు పాత బ్రిడ్జిపై ఉన్న మంచినీటి పైపులైన్లు సరిగా పనిచేయడం లేదని చిన్నాపురం గ్రామ సర్పంచ్ కాగిత గోపాలరావు, మాజీ ఎంపీపీ కాగిత వెంకటేశ్వరరావులు మంత్రికి వివరించారు. వెంకటాపురం నుంచి చిన్నాపురం వరకు మంచినీటి పైపులైన్లు సరిగా లేకపోవడం వల్ల ప్రజలకు తాగునీరు అందడం లేదన్నారు. వెంకటాపురంలో కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలన్నారు. మంచినీటి చెరువుల్లో పశువులు తిరుగుతున్నాయన్నారు. జీ ప్లస్-3 ఇళ్లకు తమవంతు డబ్బు చెల్లించామని, అయితే ఐదేళ్లుగా భవనాలు ఇవ్వడం లేదని, మౌలిక సదుపాయాలు కల్పించాలని పలువురు అర్జీలు సమర్పించారు. మచిలీపట్నం బీచ్‌ను పర్యాటకంగా అభివృద్ధి చేస్తున్న దృష్ట్యా ఫోటోగ్రాఫర్లకు ప్రివెడ్డింగ్ షూట్‌కు స్థలం కేటాయించాలని సంఘ నాయకులు చిలంకుర్తి శేషుబాబు తదితరులు కోరారు. మచిలీపట్నంలోని పట్టాభి స్మారక భవన నిర్మాణానికి హైకోర్టు ఉత్తర్వుల అమలుకు చర్యలు తీసుకోవాలని కమిటీ ప్రధాన కార్యదర్శి పీవీ ఫణికుమార్ కోరారు. తదితర సమస్యలపై పలువురు మంత్రికి వినతిపత్రాలను అందజేశారు. ప్రజల వినతులపై ఆయా శాఖల అధికారులను సంప్రదించి సమస్యలు పరిష్కరిస్తామని మంత్రి చెప్పారు.

సంస్థాగత ఎన్నికలపై దృష్టి

మచిలీపట్నం టౌన్ : మే 2న రాజధాని అమరావతికి ప్రధాని మోదీ వస్తున్న సందర్భంగా నియోజకవర్గం నుంచి నాలుగు వేల మందిని తీసుకుని వెళ్లేందుకు పార్టీశ్రేణులు చిత్తశుద్ధితో కృషి చేయాలని మంత్రి రవీంద్ర అన్నారు. శుక్రవారం రాత్రి నాయకులు, కార్యకర్తల విస్తృత సమావేశంలో మంత్రి మాట్లాడారు. ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను ప్రజల వద్దకు తీసుకు వెళ్లాలన్నారు. రానున్న మునిసిపల్ ఎన్నికలకు ఇప్పటి నుంచే ప్రణాళికా బద్ధంగా పనిచేయాలన్నారు. సమావేశంలో మోటమర్రి బాబాప్రసాద్, గొర్రెపాటి గోపీచంద్, ఎండీ ఇలియాస్ పాషా, కార్పొరేటర్ చిత్తజల్లు నాగరాము, అన్నం ఆనంద్, కాగిత వెంకటేశ్వరరావు, మార్కెట్ యార్డు చైర్మన్ కుంచే నాని తదితరులు పాల్గొన్నారు.

కేసరపల్లిలో దొంగల హల్‌చల్

» రూ. 30లక్షల ఆభరణాలు చోరీ


ఇంట్లో చోరీజరిగిన ప్రదేశాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

గన్నవరం(ఉంగుటూరు), ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : ఇంట్లో దొంగలుపడి 30లక్షల విలువచేసే సుమారు 280గ్రాముల బంగారు ఆభరణాలు దోచుకుపోయిన సంఘటన గన్నవరం మండలపరిధిలోని కేసరపల్లిలో గురువారం రాత్రి జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన పిళ్లా వెంకటేశ్వరరావు(63)స్థానిక సాయిశ్రీనివాసా నగర్ కాలనీలోని సొంత ఇంటిలో భార్యతో కలిసి వుంటున్నాడు. పిల్లలు ఉద్యోగరీత్యా వేరే ప్రాంతాల్లో వుంటున్నారు. నెలరోజులక్రితం కుమార్తె మహేశ్వరి పిల్లలతో కలిసి వెంకటేశ్వరరావు ఇంటికి వచ్చింది. గురువారం రాత్రి భోజనాల తర్వాత అందరూ కింది పోర్షన్‌కు తలుపులు వేసి పైగదుల్లో నిద్రించారు. శుక్రవారం తెల్లవారు జామున సుమారు 3.20గంటల సమయంలో వెంకటేశ్వరరావు భార్య కిందకి వెళ్లింది. మెయిన్‌డోర్ గడియతీసి వుండటంతో బెడ్‌రూంలోకి వెళ్లి చూసింది. బీరువాలు తెరిచివుండటం, వస్తువులు, దుస్తులు చిందరవందరగా పడివుండటంతో కంగారుగా భర్త వెంకటేశ్వరరావుకు చెప్పింది. వారు వచ్చిచూడగా బీరువాలో దాచివుంచిన సుమారు 280 గ్రాముల ఆభరణాలు, రెండులక్షల విలువచేసే డైమండ్ చైన్‌ను దొంగలు అపహరించుకుపోయినట్టు గుర్తించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు గన్నవరం పోలీసులు కేసు నమోదుచేశారు. క్లూస్‌టీంను రప్పించి ఆధారాలను సేకరించారు.

ప్రతి కుటుంబంలో మహిళా పారిశ్రామిక వేత్త

» స్వయం సంఘాల మహిళల వర్క్‌షాప్‌లో కలెక్టర్ లక్ష్మీశ


జ్యోతి వెలిగించి వర్క్‌షాప్ ప్రారంభిస్తున్న మహిళా పారిశ్రామిక వేత్తలు, చిత్రంలో కలెక్టర్ లక్ష్మీశ

విజయవాడ, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : ఇంటింటికీ ఓ మహిళా పారిశ్రామికవేత్తను తీర్చిదిద్దుతామన్న ప్రభుత్వ లక్ష్యానికి జిల్లా యంత్రాంగం శ్రీకారం చుట్టింది. శుక్రవారం మహిళా పారిశ్రామికవేత్తలతో కలెక్టర్ లక్ష్మీశ వర్క్‌షాప్‌ను నిర్వహించారు. ఒక కుటుంబం.. ఒక మహిళా పారిశ్రామికవేత్త వర్క్‌షాప్ ఉద్దేశాన్ని మీడియా సమావేశంలో కలెక్టర్ లక్ష్మీశ వెల్లడించారు.

● పేదరికంలేని రాష్ట్రాన్ని తయారు చేసేందుకు ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా స్వర్ణాంధ్ర - 2047 విజన్ డాక్యుమెంట్‌ను ఆవిష్కరించింది. జిల్లాస్థాయిలో లక్ష్యాన్ని చేరుకునేందుకు ప్రత్యేక కార్యాచరణలో భాగంగా గ్రామీణ, పట్టణ స్వయం సహాయక సంఘాల మహిళలతో పాటు ఇప్పటికే విజయవంతంగా పారిశ్రామిక యూనిట్లను నిర్వహిస్తున్న మహిళా పారిశ్రామికవేత్తలను ఒక వేదికపైకి తీసుకొచ్చేందుకు వర్క్‌షాప్ ఏర్పాటు చేసినట్టు చెప్పారు. ఒక మంచి ఆలోచనను వ్యాపార నమూనాగా తీర్చిదిద్దడం, ప్రభుత్వ పరంగా అందుబాటులో ఉన్న పథకాలు, బ్యాంక్ లింకేజీ రుణాలను సద్వినియోగం చేసుకోవడం, సరికొత్త సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవడం, ఆన్‌లైన్ మార్కెటింగ్ వంటి అవకాశాలు, శిక్షణ కార్యక్రమాలను అందిపుచ్చుకోవడం వంటివాటిని ఈ వర్క్‌షాప్‌లో స్వయం సహాయక సంఘాల మహిళలకు వివరించారు. స్వయం సహాయక సంఘాల మహిళలకు రూ.855 కోట్ల మేర జీవనోపాధి రుణాలు మంజూరు జరుగుతున్నందున వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

●2024-25 ఆర్థిక సంవత్సరంలో ఎన్టీఆర్ జిల్లా తలసరి ఆదాయం రూ.2.52 లక్షలుగా ఉందని దీనిని 2047 నాటికి రూ. 55 లక్షలు సాధించటమే లక్ష్యంగా నిర్దేశించుకోవడం జరిగిందన్నారు. వయసు, విద్యార్హతలతో సంబంధం లేకుండా వారి ఆలోచన, ఆశయంతో పాటు కష్టపడే మనస్తత్వం ఉన్న వారందరికీ ప్రభుత్వ పరంగా ఆర్థిక సహాయం, అధునాతన శిక్షణ, మార్కెటింగ్ సదుపాయాలు కల్పించడం జరుగుతుందన్నారు.

సందడిగా వర్క్‌షాప్

ఒక కుటుంబం-ఒక పారిశ్రామికవేత్తపై రైతు శిక్షణ కేంద్రంలో ఏర్పాటుచేసిన వర్క్‌షాప్‌ను కలెక్టర్ లక్ష్మీశ ప్రారంభించారు. మహిళల సారథ్యంలో ఇప్పటికే విజయవంతంగా నడుస్తున్న వివిధ సంస్థలు ఏర్పాటుచేసిన ఉత్పత్తుల స్టాళ్లను పరిశీలించారు. మహిళా పారిశ్రామికవేత్తల అసోసియేషన్ (ఏఎల్‌ఈఏపీ) పోషిస్తున్న కీలకపాత్రను అసోసియేషన్ ప్రతినిధులు వివరించారు. భవిష్యత్తులో పారిశ్రామికవేత్తలుగా ఎదగాలనుకునే మహిళలను చేయిపట్టి నడిపించేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. పునర్నవ శక్తివేల్ (పునర్నవ సస్టైనబుల్ ప్రొడక్ట్స్), సీహెచ్ జితేంద్రియ (ఆకృతి బయోగ్రీన్), కీర్తన (9 నట్జ్), మాధురి (శ్రీ శ్యామలాంబ ఫుడ్ ప్రొడక్ట్స్), శ్రీకాంత్ (శ్రీకాంత్ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్), నవీన్ (ట్విల్స్), డి.విజయదుర్గ (శ్రీ సహస్ర ఇండస్ట్రీస్), పార్వతి (మన అర్బన్ బౌల్)లు స్వయం సహాయక సంఘాల మహిళలకు విలువైన సూచనలు ఇచ్చారు. చేతిలో చిల్లిగవ్వ లేకున్నా పారిశ్రామికవేత్తగా ఎదిగి తనతో పాటు మరో పదిమందికి ఉపాధి కల్పించాలనే దృఢ సంకల్పం, ఆలోచనకు ఆశయం తోడైతే విజయవంతంగా ముందుకెళ్లవచ్చని పారిశ్రామికవేత్తలు స్పష్టం చేశారు. కార్యక్రమంలో డీఆర్డీఏ పీడీ ఏఎన్వీ నాంచారరావు, యూసీడీ పీవో పి.వెంకట నారాయణ, జిల్లా గ్రామీణ సమాఖ్య అధ్యక్షులు కల్పన, అర్బన్ సమాఖ్య అధ్యక్షులు మీనాక్షి, అసోసియేషన్ ఆఫ్ లేడీ ఎంటర్‌ప్రెన్యూర్స్ ఆఫ్ ఇండియా రాష్ట్ర సారథి కనకదుర్గమ్మ పాల్గొన్నారు.

మట్టి కొట్టేస్తున్నారు

(3వ పేజీ తరువాయి)

కొనసాగిస్తుండటం గమనార్హం. నిమ్మకూరు, జమీగొల్వపల్లిలోనూ మట్టి తవ్వకాలు జోరుగా సాగుతున్నాయి. కళ్లెదుటే ఇంత జరుగుతున్నా రెవెన్యూ, పంచాయతీ, రవాణా, మైనింగ్ విభాగం అధికారులు పట్టించుకోవడం లేదు.

మచిలీపట్నం మండలంలో..

మచిలీపట్నం మండలంలోని కర్రగ్రహారం, చినకర్రగ్రహారం, బుద్దాలపాలెం, చిన్నాపురం, గుండుపాలెం, బందరు వెస్ట్, చినయాదరలో స్థానిక ప్రజాప్రతినిధుల కనుసన్నల్లో రాత్రి సమయంలో మట్టిని తవ్వి విక్రయిస్తున్నారు. కొన్నిరోజులుగా ఈ వ్యవహారం నడుస్తోంది. చినయాదర గ్రామంలోని ఓ ప్రజాప్రతినిధి చెరువు మట్టిని తవ్వి చుట్టుపక్కల గ్రామాల్లో ఖాళీ స్థలాలను మెరకచేసేందుకు విక్రయిస్తున్నాడు. ఈ విషయంపై గ్రామస్థులు, అధికార పార్టీ నాయకులు అన్ని ఆధారాలతో అధికారులకు ఫిర్యాదు చేశారు. తెరవెనుక ఏ జరిగిందో గానీ.. పగటి సమయంలోనూ ఈ చెరువు నుంచి మట్టిని తరలించి విక్రయిస్తున్నారు. కర్రగ్రహారం, గోపువానిపాలెం తదితర గ్రామాల నుంచి బుసకను తరలిస్తున్న వారి నుంచి ఒక్కో ట్రాక్టరుకు రూ.100 చొప్పున వసూలుచేస్తూ రెవెన్యూ అధికారులు మిన్నకుండిపోతున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

జేవీ విధానంలోనే మెట్రో

(3వ పేజీ తరువాయి)

వాటాను థర్డ్‌పార్టీ ఫైనాన్స్ సంస్థల దగ్గర అప్పు తీసుకోవాల్సి ఉంటుంది. ఏ సంస్థ దగ్గర అప్పు తీసుకోవాలన్నది కేంద్ర ప్రభుత్వమే నిర్దేశిస్తుంది. థర్డ్‌పార్టీ ఫైనాన్స్ సంస్థలను నిర్దేశించాలంటే.. ప్రస్తుతం ఏపీఎంఆర్‌సీ, రాష్ట్ర ప్రభుత్వం పంపించిన డీపీఆర్‌కు కేంద్రం ఆమోదం తెలపాల్సి ఉంటుంది. ఇది జరగాలంటే విజయవాడ నగరంలో సమగ్ర రవాణా ప్లాన్ (సీఎంపీ)ను పూర్తి చేయాల్సి ఉంటుంది. ఇందుకోసం ఇప్పటికే కన్సల్టెంట్‌ను ఎంపిక చేశారు. ఆరు నెలల్లో ఈ నివేదిక పూర్తవుతుంది. కానీ, పనుల్లో వేగం తీసుకురావటం కోసం 3 నెలల్లో అందించాలని ఏపీఎంఆర్‌సీ కోరింది. రెండున్నర నెలల్లోనే సీఎంపీ ఇచ్చేందుకు కన్సల్టెన్సీ సంస్థ సర్వే చేపడుతోంది. ప్రస్తుతం నెల సమయం గడిచింది. మరో నెలన్నరకు సీఎంపీ వస్తుంది. ఆ ప్లాన్ రాగానే ఏపీఎంఆర్‌సీ.. కేంద్ర ప్రభుత్వానికి పంపిస్తుంది. కేంద్రం ఆమోదం తెలిపే సందర్భంలో మాత్రమే థర్డ్‌పార్టీ ఫైనాన్షియల్ ఆర్గనైజేషన్ ఏమిటన్నదానిపై కేంద్రం స్పష్టతనిస్తుంది. ప్రపంచ బ్యాంకు, జైకా, ఏడీబీ, కేఎఫ్ డబ్ల్యూ.. ఇలా ఏదో ఒక్క ఆర్థిక సంస్థ పేరును ప్రతిపాదిస్తుంది. మరో రెండు నెలల్లో ఈ ప్రాజెక్టుపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	120, 129, 140
చికెన్ విత్ స్కిన్	226
చికెన్ స్కిన్‌లెస్	236

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 425

ఆలయ అభివృద్ధికి ఆళ్ల విరాళం

హనుమాన్‌జంక్షన్‌రూరల్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : సింగన్నగూడెంలో సోమేశ్వర స్వామి దేవస్థాన పునర్నిర్మాణానికి ఎనెస్పీ ఎల్పీ ప్రాజెక్ట్ కమిటీ వైస్ చైర్మన్ ఆళ్ల గోపాలకృష్ణ, మణికృష్ణ దంపతులు విరాళం అంద జేశారు. ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులకు శుక్రవారం రూ.లక్ష విరాళాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు కొట్టే రాజకోటేశ్వరరావు, సర్పంచ్ కసుకుర్తి రంగామణి, ఉప సర్పంచ్ బెజవాడ వెంకట కృష్ణారావు, నీటి సంఘ అధ్యక్షుడు సాంబశివరావు, పర్వతనేని రాజబాబు, పల్లగాని వీరాంజనేయులు, రామ్మోహనరావు తదితరులు పాల్గొన్నారు.



ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులకు విరాళం అందజేస్తున్న ఆళ్ల గోపాలకృష్ణ, మణికృష్ణ దంపతులు

దాడిలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి



గోపాల్

పెనమలూరు, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : పెనమలూరు మహిళా మండలి కట్టపై మంగళవారం దాడికి గురైన గోపాల్ అనే వ్యక్తి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుని బంధువుల వివరాల మేరకు.. మహిళా మండలి కాల్వ కట్టపై వేర్వే రుగా ఉంటున్న గోపాల్, స్వప్నల మధ్య వివాహేతర సంబంధం ఉందని, ఇటీవల మనస్పర్థలు రావడంతో వేర్వేరుగా ఉంటున్నారని తెలిపారు. ఈ క్రమంలో స్వప్న గత మంగళవారం గోపాల్‌పై దాడి చేయించి విచక్షణా రహితంగా కొట్టించింది. దీంతో తీవ్రంగా గాయపడ్డ గోపాల్‌ను విజయవాడ ఆసుపత్రిలో చేర్చారు. చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. పెనమలూరు పోలీసులకు ఫిర్యాదు చేద్దామని వచ్చిన మృతుని బంధువుల ఫిర్యాదును పోలీసులు పట్టించుకోవడం లేదని నిరసన వ్యక్తం చేశారు. తమకు న్యాయం చేయాలని, స్వప్నను అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ఉయ్యూరు, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : కాటూరు సబ్‌స్టేషన్ పరిధిలో 33/11 కేవీ లైన్ మరమ్మతుల కారణంగా శనివారం కాటూరు, కడవకొల్లు, వీరవల్లి, పొట్లపాడు, కలవ పాముల, రాజుపేట గ్రామాల్లో వ్యవసాయం, వాణిజ్య, గృహవినియోగదారులకు ఉదయం 6 నుంచి 9 గంటల వరకు, పెదఓగిరాల సబ్‌స్టేష పరిధిలో గల చినఓగిరాల ఫీడరుపై చెట్ల తొలగింపు, మరమ్మతుల కారణంగా ఉదయం 7 నుంచి 10 గంటలవరకు చిన ఓగిరాలలో గృహ, వ్యవసాయ, వాణిజ్య వినియోగదారులకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఈఈ కృష్ణనాయక్ తెలిపారు.

వైద్యశిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

హనుమాన్‌జంక్షన్‌రూరల్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : ఆరోగ్య సమస్యలను గుర్తించి వైద్య చికిత్సను అందించేందుకు నిర్వహించే వైద్యశిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని ముఖ్యంగా మహిళలు ఆరోగ్య విషయంలో తప్పనిసరిగా పరీక్షలు నిర్వహించుకోవాలని మెడివ్యాలీ చైర్మన్ పంచకర్ల వరప్రసాద్ శుక్రవారం అన్నారు. ఎస్.ఎన్. పాలెంలో ఆదివారం నిర్వహించే ప్రత్యేక మెగా వైద్యశిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. చిన్నారులకు, మహిళలకు, ఈఎన్‌టీ, తదితర విభాగాలకు చెందిన ప్రముఖ వైద్యులు పరీక్షలు నిర్వహిస్తారని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఘనంగా రమా సత్యనారాయణస్వామి వ్రతం

హనుమాన్‌జంక్షన్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : స్థానిక నూజివీడు రోడ్డులోని శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి దేవ స్థానంలో శుక్రవారం సామూహిక రమా సత్యనారాయణస్వామివ్రతం ఘనంగా నిర్వహిం చారు. ఆలయ అర్చకులు చక్రావధానుల సీతారామాచార్యులు ఆధ్వర్యంలో నిర్వహించిన వ్రతంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని వ్రతాన్ని ఆచరించారు.

కల్లాలు, రోడ్లపైనే ధాన్యం!

- సంచులు, వాహనాలు సమకూర్చడంలో అధికారులు విఫలం
- పంట కోసి కాపలాకాయలేక ఇబ్బంది పడుతున్న రైతులు



వాహనాలు రాక పేరుకుపోయిన ధాన్యం బస్తాలు

(విజయవాడ రూరల్ - ఆంధ్రజ్యోతి)

రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన పంట కొనుగోళ్ల విషయంలో తీవ్ర జాప్యం జరుగుతుంది. చేతికొచ్చిన పంటను అమ్ముకుని ఆ కష్టాన్ని మరిచి పోదామనుకున్న రైతుకు ధాన్యం తరలింపు వ్యవహారం తలనొప్పిగా మారింది. ధాన్యం తరలించేందుకు అధికారులు సరిపడా సంచులు, వాహనాలు సమకూర్చకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పండించిన పంటను వారాల తరబడి కల్లాలు, రోడ్లపై పోసి రాత్రి, పగలు కాపలా కాసుకోవాల్సిన దుస్థితి తలెత్తింది. విజయవాడ రూరల్ మండంలోని పలు గ్రామాల్లో ఇదే పరిస్థితులు కనిపిస్తున్నాయి. ప్రధానంగా నున్నలో ధాన్యం కొనుగోలు, తరలింపు విషయమై జరుగుతున్న జాప్యం కారణంగా రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.



సంచులు లేక రోడ్డుపైనే ధాన్యం రాశులు

పంట కోసి పది రోజులైనా ..

నున్న గ్రామ పరిధిలో వేల ఎకరాల్లో వరి పంటలు వేసిన రైతులు నెల రోజులుగా పంటలు కోత కోస్తున్నారు. గతంలో పోలిస్తే ఈ ఏడాది దిగుబడి కూడా ఎక్కువగా ఉండంతో రైతుల ఆనందానికి అవధుల్లేవు. అయితే కోసిన పంటను తరలించేందుకు గానూ రైతులు ధాన్యాన్ని కల్లాలో ఉంచగా మరి కొందరు సమీపంలోని పశ్చిమ బైపాస్, పోలవరం కాలువకట్ట రోడ్లపైకి తర లిం చారు. అయితే అధికారులు సకాలంలో ధాన్యం కొనుగోలు చేపట్టక పోవడంతో అయా ప్రాంతాల్లో ధాన్యపు రాశులు గుట్టలుగా పేరుకుపోయాయి. సంచుల్లోకి ఎత్తిన ధాన్యం సైతం అధికారులు వాహనాలు ఏర్పాటు చేయక రోడ్లపై ఉండిపోయాయి. గ్రామంలోని పంటకు సుమారు 80 వేల సంచులు అవసరం ఉండా కేవలం 35వేలు మాత్రమే సమకూర్చడంతో సంచులు లేక ధాన్యం రోడ్లపైనే నిల్వ ఉండిపోతుంది. ఏదోలా రైతులు సంచులు సమకూర్చుకున్నా వాహనాల కొరత ఇబ్బందులకు గురిచేస్తుంది. స్థానికంగా ధాన్యం తరలిపు నకు రోజుకు ఏనిమిది వరకూ వాహనాలు ఏర్పాటు చేయాల్సి ఉండగా మూడు, నాలుగు వాహనాలు అందుబాటులో ఉండడంతో రైతులు వాహనాల కోసం పోటీ పడాల్సి వస్తుంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి ధాన్యం తరలింపుపై ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



డ్రైవింగ్ సర్టిఫికెట్లు అందజేస్తున్న అగ్నిమాపకశాఖ డీజీ ప్రతాప్, రాజా

డ్రైవర్లకు శారీరక, మానసిక ఆరోగ్యం తప్పనిసరి

హనుమాన్‌జంక్షన్‌రూరల్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : భారీ వాహనాలను సుదూరాలకు నడిపే డ్రైవర్లకు శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఆరోగ్యం కూడా అవసరమని రాష్ట్ర విపత్తు ప్రతిస్పందన, అగ్నిమాపక సేవల డైరెక్టర్ జనరల్ మాదిరెడ్డి ప్రతాప్ అన్నారు. అంపాపురం లోని ది కృష్ణా డిస్ట్రిక్ట్ లారీ ఓనర్స్ అసోసి యేషన్ మోడల్ డ్రైవింగ్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ అండ్ రీసెర్చ్ సెంటర్‌లో హెవీ వెహికిల్ డ్రైవింగ్ శిక్షణ పూర్తి చేసుకున్న ట్రైనీలకు శుక్రవారం సర్టిఫికెట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో కృష్ణాడిస్ట్రిక్ట్ లారీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు నాగుమోతు రాజా, ఉపాధ్యక్షుడు కె.వి.ఎస్. చలపతి రావు, అల్లాడ వీరవెంకట సత్యనారాయణ, రావి శరత్‌బాబు, పొట్లూరి చంద్రశేఖ రరావు పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి నిరంతర కృషి

ఎమ్మెల్యే బోడె ప్రసాద్



శ్మశాన వాటిక అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్

గంగూరు (కంకిపాడు), ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా కృషి చేస్తున్నట్టు ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అన్నారు. పెనమలూరు మండలం గంగూరు గ్రామంలో రూ. 14లక్షలతో శ్మశాన వాటిక అభివృద్ధికి శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని కంకిపాడు, పెనమలూరు, ఉయ్యూరు మండలాల అభివృద్ధికి కట్టుబడి ఉన్నామన్నారు. నియోజకవర్గంలోని అన్ని ప్రధాన రహదారుల అభివృద్ధి వేగంగా జరుగుతుదన్నారు. డ్రెయినేజీ పనులు కూడా ప్రాధాన్యత క్రమంలో అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. నియోజకవర్గంలోని శ్మశాన వాటికల అభివృద్ధికి పక్కా ప్రణాళిక రూపొందించాలని సంబంధిత అధికారులను ఆదేశించినట్టు తెలిపారు. ఈ కార్యక్రమం లో అక్బర్ బాషా, అనుమోలు ప్రభాకర్, కోయా ఆనంద్ ప్రసాద్, ఇర్ఫాన్ పాషా, అబ్దుల్ సలాం, అబ్దుల్ గౌస్, కోటయ్య, పాల్గొన్నారు.

తాడిగడప మునిసిపాలిటీని అభివృద్ధి చేస్తా

పెనమలూరు : వచ్చే నాలుగేళ్లలో రాష్ట్ర మునిసిపల్ మంత్రిత్వశాఖ సహకారంతో తాడిగడప మునిసిపాలిటీని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ వెల్లడించారు. శుక్రవారం పోరంకి టీడీపీ కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ, ఇప్పటికే కోట్లాది రూపాయలు రోడ్ల నిర్మాణానికి, డ్రెయిన్ల అభివృద్ధికి ఖర్చు చేస్తున్నా.. ఇంకా డిమాండ్లు వస్తూనే ఉన్నాయని తెలిపారు. నియోజకవర్గ పరిధిలో ఇప్పటికి 25కోట్ల ఎన్నార్జీఎస్ నిధులతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని, దాదాపు 90శాతం పనులు పూర్తయ్యాయని పేర్కొన్నారు. మునిసిపాలిటీలో ఎన్నార్జీఎస్ నిధులతో పాటు మునిసిపల్ నిధులు కలిపి మొత్తం 15కోట్లతో పనులు చేపట్టినట్లు ఆయన తెలిపారు. గత ప్రభుత్వంలో మూలన పెట్టిన వీఆర్ సిద్ధార్థ ఫైవంతెన, యనమలకుదురు వంతెనలను పూర్తి చేసి స్థానికులకు అందుబాటులోకి తెచ్చామని గుర్తు చేశారు. కానూరులో చాలా రోడ్లను సిమెంటు రోడ్లుగా మార్చామని, కానూరు, తాడిగడప, యనమలకుదురు, పోరంకి గ్రామాల్లో ముప్పై కోట్లతో మరికొన్ని అభివృద్ధి పనులు చేపడుతున్నామని, వచ్చే మూడు నెలల్లో ప్రస్తుతం చేపట్టే పనులన్నీ పూర్తి చేసి తీరతామని వెల్లడించారు. కానూరులో కెనడీ పాఠశాల వెనుక ఉన్న భవనంలో ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ సహకారంతో ఇద్దరు డాక్టర్లు, సిబ్బందితో ఒక అర్బన్ హెల్త్ సెంటరును ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు.

పార్టీ కార్యాలయంలో వినతుల స్వీకరణ

పోరంకి టీడీపీ కార్యాలయంలో జరిగిన గ్రీవెన్సు కార్యక్రమంలో ఎమ్మెల్యే బోడె ప్రసాద్ నియోజకవర్గ వ్యాప్తంగా వచ్చిన ప్రజలు ఇచ్చిన వినతులు స్వీకరించి పరిష్కారాలు చూపారు. కంకిపాడు మండలం మద్దూరు, కాసరనేనివారి పాలెం రైతులు ఏనుగుల కోడులో సిల్టు తీయించమని, వణుకూరు గ్రామానికి చెందిన రావి పాపన్న చెరువు తూముల ద్వారా సాగు నీరు పోయేలా చర్యలు తీసుకోవాలని కోరారు. మద్దూరు గ్రామం నుంచి గోసాల సెంటరువరకు ఆర్అండ్ బీ రోడ్డు అభివృద్ధి చేయాలని కోరారు. పోరంకి పద్మనాభపురం కాలనీ వాసులు తమ కాలనీలో అంతర్గత రహదారులు, డ్రైన్లు అభివృద్ధి చేయాలని, కృష్ణానది నుంచి తాగునీటి వ్యవస్థను ఏర్పాటు చేయాలని కోరారు.

ప్రజా సమస్యల పరిష్కారంలో అలసత్వం వీడాలి

అధికారులకు ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు హెచ్చరిక



గన్నవరం హైస్కూల్ ఆవరణలో నిర్వహించిన గ్రామసభలో ప్రజా సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్

హనుమాన్‌జంక్షన్‌రూరల్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : ప్రజాసమస్యల పరిష్కారంలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అధికారులను హెచ్చరించారు. గన్నవరం హైస్కూల్ ఆవరణలో శుక్రవారం రాత్రి నిర్వహించిన గ్రామసభలో ఆయన పాల్గొని ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పలు సమస్యల పరిష్కారాల కోసం అక్కడే ఉన్న అధికారులకు సూచనలు చేశారు. పదవ తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను ఆయన అభినందించారు. నాగార్జునసాగర్ కాలువ అక్రమణ వల్ల వీఎస్ పురం కాలనీ ప్రాంతాలతో పాటు, వ్యవసాయ భూములు నీటమునుగుతున్నాయని అక్రమణలను వెంటనే తొలగించాలని రైతులు కోరారు. దావాజీగూడెం ప్రధాన రహదారితో పాటు అంతర్గత రహదారులను నిర్మించాలని స్థానికులు కోరగా నెల రోజుల్లో పనులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు మాట్లాడుతూ, ప్రజా సమస్యల పరిష్కారంలో గన్నవరం నియోజకవర్గం రాష్ట్రంలోనే రెండవ స్థానంలో ఉందని ఇదే స్ఫూర్తితో ముందుకు సాగాలని పిలుపు నిచ్చారు. గ్రామాల్లో చిన్నపాటి సమస్యలను వెంటనే సరిచేయాలని సూచించారు. ముఖ్యంగా విద్యుత్ వైర్లు వేలాడుతూండటంతో పలు వురు ప్రమాదాల బారినపడుతున్నారని, నెల రోజుల్లో విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేసి వేలాడుతున్న తీగలను సరిచేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నిడమర్తి సౌజన్య, బీజేపీ రైతుమోర్చా అధ్యక్షుడు చిగురుపాటి కుమారస్వామి, వడ్లాణం హరిబాబు నాయుడు, ఎనెస్పీ ఎల్పీ ప్రాజెక్ట్ కమిటీ వైస్ చైర్మన్ ఆళ్ల గోపాలకృష్ణ, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి దొంతు చిన్నా, చిరుమామిళ్ల సూర్యం, జాస్తి శ్రీధర్, కొమ్మరాజు సుధీర్, మద్దినేని వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



ఉపాధ్యాయురాలితో ముదునూరు జడ్పీ స్కూల్ పూర్వ విద్యార్థులు

ఉత్సాహంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం

ఉయ్యూరు, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : ముదునూరులో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పూర్వవిద్యార్థుల సమ్మేళనం శుక్ర వారం ఉల్లాసంగా, ఉత్సాహంగా జరిగింది. 1984- 1985 పదవ తరగతి విద్యార్థులు పాఠశాలలో కలుసుకుని ఒకరికొకరు క్షేమ సమాచారాలు తెలుసుకుంటూ ఆనందంగా గడిపారు. ఈ కార్యక్రమానికి సర్పంచ్ మొవ్వ వెంకటనాగలక్ష్మి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా తమకు విద్యనేర్పిన అప్పటి హిందీ ఉపాధ్యాయురాలు కె బేబీసరోజినితో పాటు సర్పంచ్ వెంకట నాగలక్ష్మిని పూర్వ విద్యార్థులు ఘనంగా సత్కరించారు. చదువుకున్న పాఠశాలకు తమ గుర్తుగా రూ. 11 వేలు విలువ చేసే ఇనుప బీరువా బహుకరించారు. మాజీ సర్పంచ్ మొవ్వ జ్ఞానశేఖర్, దాసే రవి తదితరులు పాల్గొన్నారు.

కశ్మీర్‌లో ఉగ్రదాడి హేయమైన చర్య

కంకిపాడు, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : కశ్మీర్‌లో టెర్రరిస్టుల దాడి హేయమైన చర్య అని జనసేన పార్టీ ప్రచార కమిటీ జిల్లా కో ఆర్డినేటర్ పులి కామేశ్వరరావు అన్నారు. కశ్మీర్‌లో టెర్రరిస్టుల దాడిని ఖండిస్తూ శుక్రవారం సాయంత్రం కంకిపాడు ప్రధాన సెంటర్‌లో కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా పులి కామేశ్వరరావు మాట్లాడుతూ, కశ్మీర్ దాడికి వ్యతిరేకంగా దేశ ప్రధాని నరేంద్ర మోదీ చేపడుతున్న ప్రతిచర్యలను ఆయన అభినందించాల్సిన అవసరముందన్నారు. ఈ కార్యక్రమంలో కోనా నాని, నాగేశ్వరరావు, సునీల్, కార్తీక్ వీర మహిళలు పాల్గొన్నారు.



కొవ్వొత్తుల ప్రదర్శనలో జనసేన నాయకులు

రోడ్డుపై తిరగబడ్డ ట్రాక్టర్

కంకిపాడు, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : జాతీయ రహదారిపై గురువారం అర్ధరాత్రి జరిగిన ఓ ప్రమాదంలో ట్రాక్టర్ బోల్తాపడి ఓ వ్యక్తికి తీవ్రగాయాల య్యాయి. సేకరించిన సమాచారం మేరకు.. కంకిపాడు బైపాస్‌పై రాత్రి 11.30 గంటల సమయంలో ఉయ్యూరు వైపు నుంచి గడ్డి లోడుతో ట్రాక్టర్ విజయవాడ వైపు వెళ్తుంది. అదే క్రమంలో వెనుక నుంచి వస్తున్న లారీ ట్రాక్టర్‌ను వేగంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో ట్రాక్టర్ జాతీయ రహదారిపై బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ట్రాక్టర్ డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న కంకిపాడు ఎస్సై 2 తాతాచార్యులు హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకొని క్షతగాత్రుడిని విజయవాడ ఆసుపత్రికి తరలించారు.

ఆగివున్న టిప్పర్‌లో బ్యాటరీలు చోరీ

ఉంగుటూరు, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : ఆగివున్న టిప్పర్ లారీ నుంచి సుమారు రూ.16వేలు విలువచేసే రెండు బ్యాటరీలను గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేసిన సంఘటన మండల పరిధిలోని కొయ్యగూరపాడులో జరిగింది. ఉంగుటూరు ఎస్సై యు.గోవిందు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కలపాల క్రాంతికిరణ్ టిప్పర్ లారీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఈ నెల 19న టిప్పర్ లారీ టైర్ పగిలిపోవడంతో స్థానికుడైన కొరివి శ్రీనివాసరావుకు చెందిన ఖాళీ స్థలంలో పార్క్ చేసి ఇంటికి వెళ్లాడు. శుక్రవారం ఉదయం టైర్ బిగించేందుకు లారీ దగ్గరకు వెళ్లి చూడగా బ్యాటరీతో పాటు అసెంబుల్డ్ బ్యాటరీని కూడా దొంగలు దొంగిలించుకుపోయినట్లు గుర్తించాడు. వెంటనే ఉంగుటూరు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.





రాయనపాడు రైల్వేస్టేషన్ లోపలి వ్యూ, ప్రయాణికులు స్టేషన్ బిల్డింగ్‌లోకి చేరుకోవటానికి ప్రధాన మార్గం

రాయల్‌గా రాయనపాడు

సకల సదుపాయాలతో సర్వాంగ సుందరంగా శాటిలైట్ రైల్వేస్టేషన్

- పూర్తయిన తొలిదశ అభివృద్ధి, ఆధునికీకరణ పనులు
- వెస్ట్ బైపాస్ మీదుగా కొద్ది నిమిషాల్లోనే రాజధాని గ్రామాలకు చేరుకునే అవకాశం

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): రాయనపాడు శాటిలైట్ రైల్వేస్టేషన్ తొలిదశ ఆధునీకరణ, అభివృద్ధి పనులు పూర్తయ్యాయి. సరికొత్త సొబగుల ద్ది ఈ రైల్వేస్టేషన్‌ను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. ఆధునీకరించిన ఈ రైల్వేస్టేషన్ రాజధాని అమరావతికి గేట్ వేగా నిలవబోతోంది. భవిష్యత్తులో రాజధానిలోని గ్రామీణ ప్రజలు, నగర ప్రజలు దూర ప్రాంతాల నుంచి రాయనపాడు రైల్వేస్టేషన్‌లో దిగి విజయవాడకు రాకుండానే తమ ప్రాంతాలకు చేరుకోవచ్చు. రాయనపాడు నుంచి గొల్లపూడి బయటకు రాగానే విజయవాడ వెస్ట్ బైపాస్ ఉంటుంది. ఈ వెస్ట్ బైపాస్ మీదుగా నేరుగా వెంకటపాలెం, ఇతర రాజధాని గ్రామాలకు నిమిషాల వ్యవధిలోనే చేరుకోవచ్చు. స్మార్ట్ స్టేషన్ ఫీచర్లతో రాయనపాడు రైల్వేస్టేషన్‌ను రూ.100 కోట్లతో రైల్వే శాఖ అభివృద్ధి చేస్తోంది. తొలి దశలో రూ.30 కోట్లతో అభివృద్ధి పనులు చేసింది. రాయనపాడులో నూతన రైల్వేస్టేషన్ భవనం నిర్మించి, ఇందులో అత్యాధునికమైన సదుపాయాలను కల్పించింది. అద్భుతమైన ఇంటీరియర్, ఏసీ వెయిటింగ్ హాల్స్ నిర్మించింది. డిజిటల్ డిస్‌ప్లే బోర్డులు, ఫ్రీ వైఫై, ఆన్‌లైన్ టికెటింగ్, సోలార్ పవర్, మహిళలు, వృద్ధులకు ప్రత్యేక సదుపాయాలు కల్పించింది. ఫుడ్‌కోర్టులు, రిటైల్ దుకాణాలకు కూడా అవకాశం కల్పించింది. ఆధునికమైన మరుగుదొడ్లు, తాగునీటి సదుపాయాలు కల్పించింది. వీటితో పాటు రైల్వేస్టేషన్‌కు వచ్చే ప్రయాణికుల భద్రతను దృష్టిలో ఉంచుకుని సీసీ కెమెరాలు, మెరుగైన ఎల్ఈడీ లైటింగ్ సదుపాయాలను కల్పించింది. ఇవి కాకుండా ప్లాట్‌ఫామ్‌లను అందంగా, విశాలంగా తీర్చిదిద్దింది. ప్లాట్‌ఫామ్‌లపైనా ప్రయాణికులు కూర్చునేందుకు వీలుగా సీటింగ్ ఏర్పాటు చేసింది. స్టేషన్‌లో ఎలక్ట్రిఫికేషన్, సిగ్నలింగ్ సిస్టమ్‌ను ఏర్పాటు చేసింది. స్టేషన్ బయట కాంక్రీట్ ఫ్లోర్, చూడముచ్చటైన ల్యాండ్ స్కేపింగ్ అందరినీ ఆకట్టుకుంటున్నాయి.



పార్కింగ్ స్టాండ్



స్టేషన్ లోపల..



ఆధునీకరించిన ప్లాట్‌ఫామ్‌లు



ఏసీ వెయిటింగ్ హాల్, తాగునీటి కుళాయిలు



రాణిగారితోట నుంచి కృష్ణానది మధ్యలోకి క్యూలో వెళ్తున్న గేదెలు

పశువులకూ పద్ధతుంది!

(ఆంధ్రజ్యోతి-రాణిగారితోట): క్రమశిక్షణ, పద్ధతి లేని ఎవరినైనా తిట్టేటప్పుడు నువ్వు మనిషివా..పశువువా అంటాం. కానీ, ఈ చిత్రాన్ని చూశాక ఆ అభిప్రాయాన్ని మార్చుకోవాల్సిందే. మనుషుల్లో పద్ధతి, క్రమశిక్షణ ఉంటుందో లేదో తెలియదు గానీ, పశువుల్లో మాత్రం అవి ఉన్నాయనడానికి రాణిగారితోట నుంచి కృష్ణానదిలోకి 'క్యూ పద్ధతి'లో వెళుతున్న పై చిత్రంలోని గేదెలే ఉదాహరణ. వివరాల్లోకి వెళితే.. రాణిగారితోటలో పలువురు గేదెలను మేపుకొని పాలు విక్రయించుకుని జీవిస్తుంటారు. ఉదయం పాలు పితికిన తర్వాత వాటిని కృష్ణానదిలోకి తోలతారు. ఈ పశువులు నది మధ్యలోకి వెళ్లి సాయంత్రానికి వాటి షెడ్లలోకి చేరతాయి. ఈ క్రమంలోనే శుక్రవారం ఉదయం నదిలోకి 'క్యూ పద్ధతి'లో వెళుతున్న గేదెలు కెమెరా కంటికి చిక్కాయి.



పెనమలూరు స్టేషన్‌లో వివరాలను వెల్లడిస్తున్న ఎస్పీ గంగాధరరావు

వృద్ధురాలి అనుమానాస్పద మృతి కేసులో

వీడిన మిస్టరీ

- యనమలకుదురులో వృద్ధురాలిని అంతమొందించిన మహిళ, ఆమె స్నేహితుడు.. అంతకుముందు మృతురాలి కొడుకును మెదక్‌లో హత్య చేసిన నిందితులు
- కొడుకు ఆచూకీపై ప్రశ్నించడంతో వృద్ధురాలి హత్య
- పెనమలూరు పోలీసుల అదుపులో నిందితులు

పెనమలూరు, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): యనమలకుదురు కృష్ణానది లంకగట్టుపై అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన వృద్ధురాలి కేసు మిస్టరీ వీడింది. శుక్రవారం పెనమలూరు పోలీసుస్టేషన్‌లో ఎస్పీ గంగాధరరావు కేసు వివరాలను వివరించారు. 'యనమలకుదురులో అనుమానాస్పదంగా మృతి చెందిన వృద్ధురాలు పోతుల పోచమ్మ స్వగ్రామం మెదక్ జిల్లాలోని ఘన్‌పూర్ మండలం గంగాపూర్. ఆమె కుమారుడు మహేష్, వివాహమై ఇద్దరు పిల్లలున్నారు. అదే గ్రామానికి చెందిన బండి శోభతో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడు. శోభకు మహేష్ బంగారు గొలుసు ఇచ్చాడు. గొలుసును తాకట్టుపెట్టగా వచ్చిన డబ్బును శోభ ఖర్చు చేసింది. తన గొలుసు ఇవ్వాలని మహేష్ ఒత్తిడి చేస్తుండడంతో అప్పటికే తనకు పరిచయమున్న మరో స్నేహితుడు మామిడి గోపాల్‌తో కలిసి మహేష్‌ను అంతమొందించేందుకు కుట్ర పన్నింది. మహేష్‌ను నమ్మించి వారిద్దరూ మెదక్ జిల్లా ఏడుపాయల వంతెన దగ్గర్లో ఉన్న పోతంశెట్టిపల్లె వద్దకు తీసుకెళ్లారు. ఊరు చివర వాగులో రాయి మీద కూర్చొని కల్లు తాగుతుండగా కిందికి నెట్టేసి అతని మెడలోని తుండును మెడకు బిగించి చంపి, అక్కడే వదిలేశారు. తన కుమారుడు కనిపించకపోవడంతో అనుమానం వచ్చి గోపాల్‌ను శోభను పోచమ్మ నిలదీసింది. నిజం చెప్పకపోతే కేసు పెడతానని బెదించింది. దీంతో వారిద్దరూ మహేష్ విజయవాడ దుర్గమ్మ గుడికి వెళ్లి ఉంటాడని నమ్మించారు. యనమలకుదురు గ్రామానికి ఈనెల నాలుగున తీసుకొచ్చారు. శోభను, పోచమ్మను హోసన్నా మందిర్ వద్ద ఉంచి దగ్గరలోని మద్యం షాపులో మద్యం తెచ్చి గోపాల్ ఇచ్చాడు. కృష్ణానదిలో ఇసుక పనులకు మహేష్ వెళ్లి ఉంటాడని నమ్మించారు. గ్యాస్ గోడౌన్ రోడ్డులోని కృష్ణానది లంక గట్టు మీదికి ఉదయం తీసుకెళ్లి పోచమ్మకు లోబీపీకి దారితీసే ట్యాబ్లెట్లు కలిపిన కల్లు ఇచ్చారు. షాపులో కొన్న మద్యాన్ని గోపాల్, శోభ తాగారు. కల్లు తాగిన పోచమ్మ బీపీ డౌనవడంతో స్పృహ తప్పి కింద పడిపోయింది. ఆమె చీరను మెడకు బిగించి చంపేసి చెవులకు ఉన్న బంగారు దిద్దులు తీసేసుకున్నారు. ముక్కుపుడకను తీయడానికి ప్రయత్నించినా రాకపోవడతో మృతదేహాన్ని అక్కడే పడేసి రైలు ఎక్కి మెదక్ వెళ్లిపోయారు.' అని ఎస్పీ తెలిపారు. బండి గోపాల్ అక్క బావ బతుకుదెరువు కోసం యనమలకుదురు వచ్చి స్థిరపడ్డారని, వారి ఇంటికి రెండు మూడుసార్లు గోపాల్, శోభ వచ్చి వెళ్లారని ఈ పరిసరాలు తెలిసి ఉండడం వల్ల పోచమ్మను ఇక్కడికి తీసుకొచ్చి అంతమొందించారని పోలీసులు చెబుతున్నారు. నిందితుల కోసం పెనమలూరు పోలీసులు మెదక్‌లో విచారిస్తుండగా..మెదక్ పోలీసులు విచారిస్తున్నారనుకుని భయపడి వారిద్దరూ యనమలకుదురులో తలదాచుకుందామని వచ్చారు. చింతలకట్ట వద్ద దుకాణంలో కల్లు తాగుతుండగా పెనమలూరు పోలీసులు అదుపులోకి తీసుకొన్నారు.



బీసీ స్టడీ స్కరిల్‌లో సివిల్స్‌కు శిక్షణ పొందుతున్న యువతతో కలిసి భోజనం చేస్తున్న మంత్రి సవిత

బీసీ యువత ఉన్నతే సీఎం చంద్రబాబు లక్ష్యం

- బీసీ స్టడీ స్కరిల్ శిక్షణ కేంద్రం తనిఖీలో మంత్రి సవిత

ఇబ్రహీంపట్నం, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): బీసీ యువత ఉన్నతే సీఎం చంద్రబాబునాయుడి లక్ష్యమని బీసీ సంక్షేమశాఖ మంత్రి ఎస్.సవిత అన్నారు. గొల్లపూడిలోని బీసీ భవన్‌లో బీసీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సివిల్ సర్వీసెస్ శిక్షణ కేంద్రాన్ని ఆమె శుక్రవారం తనిఖీ చేశారు. వంట గది అపరిశుభ్రంగా ఉండటంపై మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. రాత్రి వంట కోసం టమాటా, ఇతర కూరగాయలు ఉదయమే కోసి సిద్ధం చేయడం..వాటిపై ఈగలు వాలడం, వాటి పక్కనే వాడుక నీరు ఉండడంపై అసహనం వ్యక్తం చేశారు. పక్కనే పక్వానికి రాని అరటి పండ్లు ఉండటంపై బీసీ వెల్ఫేర్ అధికారులపై మండిపడ్డారు. పక్వానికి రాని అరటిపండ్లు మీరు తింటారా..మీ పిల్లలకు తినిపిస్తారా అని నిలదీశారు. అభ్యర్థుల విశ్రాంతి గదులు, స్నానాలగదులను పరిశీలించారు. గదులు అపరిశుభ్రంగా ఉండటంతో అన్ని గదుల్ని, స్నానాలగదులను శుభ్రం చేయించాలని ఆదేశించారు. మెనూ ప్రకారం అభ్యర్థులకు రుచికరమైన ఆహారం ఎప్పటికప్పుడు తయారు చేసి అందించాలన్నారు. సివిల్ సర్వీసెస్ కోచింగ్ అభ్యర్థులతో కలిసి ఆమె మధ్యాహ్న భోజనం చేశారు. అభ్యర్థులు తన దృష్టికి తెచ్చిన సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. బీసీ యువతకు ఎంత వరకు మేలు చేయొచ్చో అంత మేలు చేసే కార్యక్రమంలో భాగంగా సివిల్ సర్వీసెస్, డీఎస్సీ వంటి పోటీ పరీక్షలకు బీసీ స్టడీ సర్కిల్ ద్వారా కార్పొరేట్‌కు దీటుగా ఉచిత శిక్షణ అందజేస్తున్నామన్నారు.

పెన్షనర్లపై కేంద్ర ప్రభుత్వ వైఖరి మార్చుకోవాలి

- విశ్రాంత ఉద్యోగుల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పీఎస్ఎస్ఎన్‌పీ శాస్త్రి

విజయవాడ, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): పెన్షనర్లపై కేంద్ర ప్రభుత్వ వైఖరి మార్చుకోవాలని విశ్రాంత ఉద్యోగుల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పీఎస్ఎస్ఎన్‌పీ శాస్త్రి అన్నారు. శుక్రవారం ఏపీఎస్‌జీఆర్ఈఏ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పే రివిజన్ జరిగిన ప్రతిసారి ఉద్యోగులతో పాటు పెన్షనర్లకు రివిజన్ జరిగి పెన్షన్ పెరుగుతుందని ఆయన తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఈ ఏడాది ఆర్థిక బిల్లుతో పాటు పెన్షన్ సవరణ బిల్లు ప్రవేశపెట్టి గెజిట్ పబ్లికేషన్ చేసి జీవోగా ఇచ్చిందన్నారు. దీని వల్ల కేంద్ర ప్రభుత్వ పెన్షనర్లను వర్గీకరించే అధికారం పొందిందన్నారు. ప్రస్తుతం పెన్షన్ పొందుతున్న కేంద్ర పెన్షనర్లు వచ్చే ఏడాది జనవరి 1 నుంచి అమలు చేయబోతున్న ఎనిమిదో సీపీసీలో వర్గీకరించడానికి అనర్హులవుతారన్నారు. ఇప్పుడు తీసుకుంటున్న పెన్షన్‌లో పెరుగుదల భవిష్యత్తులో ఉండదన్నారు. గతంలోనే సుప్రీం కోర్టు వర్గీకరణ పనికిరాదని తీర్పునిచ్చిందని తెలిపారు. నేడు ఆ తీర్పును తోసిపుచ్చడంతో పెన్షనర్స్‌కు అన్యాయం జరుగుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వ దారిలో రాష్ట్ర ప్రభుత్వాలు కూడా నడిచే అవకాశం ఉండడంతో, పెన్షనర్లు తీవ్ర ఆందోళన చెందుతున్నారన్నారు. మే 2న ప్రధాని మోదీ రాష్ట్రంలో పర్యటిస్తున్నందున ఏపీఎస్‌జీఆర్ఈఏ సభ్యులందరూ కవర్ క్యాంపెయిన్ ద్వారా వినతిపత్రాలు పంపుతామని తెలిపారు. అనంతరం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగ సంఘాలతో కలిసి రాజధాని, జిల్లా కేంద్రాల్లో ధర్నాలు చేస్తామని తెలిపారు. అసోసియేట్ అధ్యక్షుడు కె.ఎస్.హనుమంతరావు, జిల్లా అధ్యక్షుడు, రాష్ట్ర సెక్రటరీ బి.లోవకుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు జి.జయబాబు, సిటీ అధ్యక్షుడు ఎం.సూర్యారావు పాల్గొన్నారు.

28లోగా ప్రధాని పర్యటన ఏర్పాట్లు పూర్తి చేయాలి

- అధికారులకు రాష్ట్ర నోడల్ అధికారి వీరపాండ్యన్ ఆదేశం



గన్నవరం విమానాశ్రయంలో అధికారులతో సమీక్షలో మాట్లాడుతున్న రాష్ట్ర నోడల్ అధికారి వీరపాండ్యన్, కలెక్టర్ డీకే బాలాజీ

హనుమాన్‌జంక్షన్‌రూరల్, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): అమరావతిలో మే 2న రాజధాని పునర్నిర్మాణ పనులను ప్రారంభించేందుకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గన్నవరం విమానాశ్రయానికి విచ్చేయుచున్న సందర్భంగా ఈ నెల 28లోగా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులను రాష్ట్ర నోడల్ అధికారి వీరపాండ్యన్ ఆదేశించారు. గన్నవరం అంతర్జాతీయ విమానాశ్రయంలో కలెక్టర్ డీకే బాలాజీ, ఎస్పీ ఆర్.గంగాధరరావు, జాయింట్ కలెక్టర్ గీతాంజలిశర్మ, అధికారులతో కలిసి అంతర్జాతీయ టెర్మినల్ వద్ద గల వీఐపీ విరామశాల, ఆగమం, నిర్గమ ప్రదేశాలను ఆయన పరిశీలించారు. వివిధ ప్రభుత్వ శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ నెల 28న ఎస్పీజీ వారు రానున్నారని అదేరోజు సాయంత్రం అధికారులందరితో ప్రత్యేక సమావేశం నిర్వహించి ఏర్పాట్లను సమీక్షిస్తారని తెలిపారు. ప్రధానమంత్రి పర్యటించే మార్గంలో రాకపోకలు, నిర్మాణాలు లేకుండా చూడాలని ఆదేశించారు. ప్రధాని కొంత సమయం విమానాశ్రయంలో గడిపే అవకాశమున్నందున అందరూ అప్రమత్తంగా ఉండాలని, అవసరమైన ఏర్పాట్లు, జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజలను తరలించేందుకు ఆర్టీసీ అధికారులను సంప్రదించి అవసరమైన బస్సులు ఏర్పాటు చేశామని, ప్రధానితో పాటు రానున్న ప్రముఖులను తీసుకెళ్లేందుకు అవసరమైన వాహనాలను సమకూర్చేలా డీటీసీకి సూచించామని నోడల్ అధికారికి కలెక్టర్ బాలాజీ వివరించారు. విమానాశ్రయంలోను, ప్రధాని పర్యటించే మార్గం అంతటా కట్టుదిట్టమైన భద్రతా ప్రణాళిక రూపొందించామని ఎస్పీ గంగాధర్‌రావు వివరించారు. విమానాశ్రయ డైరెక్టర్ ఎం.ఎల్.కె.రెడ్డి, ఆర్డీవోలు బాలసుబ్రహ్మణ్యం, హేలాషారోన్, స్వాతి, డ్వామా, డీర్డీయే పీడీ శివప్రసాద్, హరిహరనాథ్, డీపీవో అరుణ, జిల్లా అగ్నిమాపక అధికారి ఏసురత్నం, ఆర్టీవో శ్రీనివాస్, డీఎఫ్‌వో సునీత, ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజనీర్ నటరాజు, ఆర్ అండ్ బీ ఇంజనీర్ లోకే ష్, డీఎంహెచ్‌వో డాక్టర్ శర్మిష్ఠ పాల్గొన్నారు.

మోదీ పర్యటనకు భారీ బందోబస్తు



సమావేశంలో మాట్లాడుతున్న సీపీ ఎస్వీ రాజశేఖర్‌బాబు

గుణదల, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్ర మోదీ మే 2వ తేదీన అమరావతి పర్యటనకు భారీ బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నట్టు ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ ఎస్వీ రాజశేఖర్‌బాబు తెలిపారు. ప్రధాని పర్యటనకు బందోబస్తు ఏర్పాట్లపై తీసుకోవాల్సిన నిర్ణయాలపై చర్చించేందుకు సీపీ కార్యాలయంలో శుక్రవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. నగరం మీదుగా అనేకమంది వీఐపీలు, వీవీఐపీలు ఎంతోమంది గన్నవరం ఎయిర్‌పోర్టు నుంచి అమరావతికి రోడ్డు మార్గాన వెళతారని, ప్రభుత్వ శాఖలను సమన్వయం చేసుకుంటూ అన్ని భద్రతా ఏర్పాట్లు చేయాలని సీపీ ఆదేశించారు. భద్రతా చర్యలు నగర వాసులకు ఇబ్బంది కలిగించకుండా ఉండేలా చూడాలన్నారు. విధుల్లో సిబ్బంది అలసత్వం వహిస్తే సహించేది లేదన్నారు. ఎక్కడైనా ట్రాఫిక్ జామ్ జరిగితే సత్వరమే నిర్ణయం తీసుకునేలా అధికారులు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. వీఐపీలు బస చేసే హోటళ్ల వద్ద కూడా పహారా ఉండేలా చూడాలన్నారు. డీసీపీలు సరిత, తిరుమలేశ్వరరెడ్డి, ఉదయరాణి, కృష్ణమూర్తినాయుడు, ఎస్వీడీ ప్రసాద్, ఏడీసీపీలు జి.రామకృష్ణ, ప్రసన్నకుమార్, ఎం.రాజారావు, కె.కోటేశ్వరరావు పాల్గొన్నారు.

గౌతమ్ సవాంగ్‌పై చర్యలు తీసుకోవాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొండా ఉమా

అజిత్‌సింగ్‌నగర్, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): వైసీపీ హయాంలో డీజీపీగా పని చేసిన గౌతమ్ సవాంగ్ అనేక అక్రమాలకు పాల్పడ్డారని, ఆయనపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు కోరారు. నాటి ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డితో కలిసి ఏపీపీఎస్సీ చైర్మన్‌గా ఉన్న గౌతమ్ సవాంగ్, కార్యదర్శి పీఎస్ఆర్ ఆంజనేయులు పాల్పడ్డ అక్రమాలపై సమగ్ర విచారణ జరిపి క్రిమినల్ చర్యలు తీసుకోవాలన్నారు. అజిత్ సింగ్ నగర్‌లోని టీడీపీ సెంట్రల్ కార్యాలయంలో శుక్రవారం ఎమ్మెల్యే విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 2022లో జరిగిన ఏపీపీఎస్సీ పరీక్షల్లో 162 పోస్టులు అమ్ముకుని రూ.150 కోట్ల కుంభకోణానికి తెరలేపారని ఆరోపించారు. మాన్యువల్‌గా జరగాల్సిన పరీక్ష వాల్యూషన్‌ను డిజిటలైజేషన్ ద్వారా చేసి వైసీపీకి అనుకూలమైన వారికి పోస్టులు కట్టబెట్టారని, ఇందులో భారీగా ముడుపులు ముట్టాయని ఆరోపించారు. డిప్యూటీ కలెక్టర్ పోస్టు రూ.2.50 కోట్లు, డీఎస్పీ పోస్టు రూ.1.50 కోట్లకు అమ్ముకున్నారని ఆరోపించారు. పరీక్ష రాసిన అభ్యర్థులు హైకోర్టును ఆశ్రయించగా సవాంగ్ కోర్టును కూడా తప్పు దోవ పట్టించారన్నారు. ఆ నోటిఫికేషన్ ద్వారా వివిధ పదవుల్లో ఉన్న 162 మంది నియామకాలు చెల్లవని ఆరు నెలలలోపు మళ్లీ పరీక్షలు నిర్వహించి నియామకపు ప్రక్రియ పూర్తి చేయాలని కోర్టు ఆదేశాలు ఇచినా నేటికి అమలు కాలేదన్నారు. నగర పోలీసు కమిషనర్‌గా పనిచేసిన సమయంలో బంగారం దొంగతనం కేసుల్లో రికవరీపై చాలా ఆరోపణలు ఉన్నాయన్నారు. ప్రైవేట్, ల్యాండ్ సెటిల్‌మెంట్లు చేసి అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారనే ఆరోపణలున్న సవాంగ్‌ను తక్షణమే అరెస్ట్ చేయాలని డీజీపీ, హోం సెక్రటరీ, ఏసీబీ, సీఐడీ విభాగాలకు లేఖలు రాశామని తెలిపారు.



పోప్ ఫ్రాన్సిస్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఫాదర్ మువ్వల ప్రసాద్ తదితరులు

పోప్ ఫ్రాన్సిస్ మరణం ప్రపంచ క్రైస్తవులకు తీరనిలోటు

బెంజిసర్కిల్, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): విశ్వశాంతిదూత, జగద్గురువులు పోప్ ఫ్రాన్సిస్ మరణం ప్రపంచ క్రైస్తవులకు తీరనిలోటని ఆంధ్రప్రదేశ్ ఫెడరేషన్ ఆఫ్ చర్చస్(ఏపీఎఫ్‌సీ) ఎగ్జిక్యూటివ్ సెక్రటరీ, విజయవాడ సెయింట్ పాల్స్ కథెడ్రల్ విచారణ గురువు రెవరెండ్ ఫాదర్ మువ్వల ప్రసాద్ అన్నారు. శుక్రవారం సాయంత్రం బెంజిసర్కిల్‌లోని సెయింట్ పాల్స్ కథెడ్రల్ కమ్యూనిటీ హాలులో ఏపీఎఫ్‌సీ, విజయవాడ పాస్టర్ ఫెలోషిప్ సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన పోప్ ఫ్రాన్సిస్ సంతాప సభలో ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆయన ప్రసంగించారు. ఆర్థిక సమానత్వం, పేద ప్రజల కోసం పోప్ చేసిన కృషి అభినందనీయమన్నారు. ఏపీఎఫ్‌సీ సెక్రటరీ రెవరెండ్ పాస్టర్ ఇందుపల్లి కరుణానిధి అధ్యక్షత వహించగా ఫాదర్ ప్రసాద్‌తోపాటు నిర్మల కాన్వెంట్ సిస్టర్స్, పాస్టర్లు పోప్ ఫ్రాన్సిస్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పాస్టర్లు పోప్ ఫ్రాన్సిస్ చిత్రపటం వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

లేబర్‌కోడ్‌లు రద్దు చేసే వరకు పోరాటం

- కేంద్ర కార్మిక సంఘాల సదస్సు తీర్మానం



సదస్సులో ప్రసంగిస్తున్న సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నరసింగరావు

గవర్నర్‌పేట, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): కార్మికులు పోరాడి సాధించుకున్న 29 కార్మిక అనుకూల చట్టాలను రద్దు చేసి కార్మిక వ్యతిరేక 4 లేబర్‌కోడ్‌లను కేంద్ర ప్రభుత్వం అమల్లోకి తెచ్చిందని, దీనిపై కార్మిక లోకం పోరాటాలు కొనసాగిస్తోందని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నరసింగరావు అన్నారు. లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని, జాతీయ ప్రయోజనాలకు వ్యతిరేకమైన ప్రైవేటీకరణ విధానాలు రద్దు చేయాలని, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, 8 గంటల పనిదినాలు అమలు చేయాలని కోరుతూ కేంద్ర కార్మిక సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం ఎంజీ రోడ్డులోని ఎంబీవీకే భవన్‌లో రాష్ట్ర సదస్సు నిర్వహించారు. సదస్సుకు సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వి.ఉమామహేశ్వరరావు అధ్యక్షత వహించారు. లేబర్ కోడ్‌లు అమల్లోకి వస్తే ఉద్యోగ భద్రత ఉండదని నరసింగరావు అన్నారు. మే 20న దేశవ్యాప్తంగా కార్మిక సమ్మెకు మద్దతు ప్రకటించాలని కార్మికులకు పిలుపునిచ్చారు. కేంద్రంలో 8వ వేతన సంఘాన్ని, రాష్ట్రంలో 12వ వేతన సంఘాన్ని నియమించాలని ఉమామహేశ్వరరావు కోరారు. సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఏవీ నాగేశ్వరరావు, ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.రవీంద్రనాథ్, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. పోలారి, ఏఐయూటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుధీర్‌బాబు, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ, ఏఐఎఫ్టీయూ(న్యూ) రాష్ట్ర కార్యదర్శి జాస్తి కిషోర్‌బాబు పాల్గొన్నారు.

30న ఉయ్యూరులో జాబ్‌మేళా

మచిలీపట్నం, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): నైపుణ్యాభివృద్ధి, శిక్షణశాఖ అధ్వర్యంలో ఉయ్యూరులోని ఏజీ అండ్ఎస్జీ సిద్ధార్థ కళాశాలలో ఈనెల 30వ తేదీన జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ డీకే బాలాజీ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంఎస్ఎన్ ల్యాబరేటరీ, ఎస్ఎస్ ఇనుస్ట్రుమెంట్స్, కురాకు ఫైనాన్షియల్ సర్వీసెస్, ఎంఆర్ఎఫ్, సుధీర్ టింబర్ డిపో, ముత్తూట్ మనీ లిమిటెడ్ సంస్థల్లో ఉద్యోగాలు ఇస్తామని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న వారు 96187 13243, 88851 59008 నెంబర్లకు ఫోన్ చేసి సంప్రదించాలని సూచించారు.



బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	120, 129, 140
చికెన్ విత్ స్కిన్	226
చికెన్ స్కిన్‌లెస్	236

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 425

ట్రాక్టర్ నుంచి జారిపడి విద్యార్థి మృతి



మృతుడు మణికంఠ

మచిలీపట్నం టౌన్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : పొట్లపాలెం వద్ద ట్రాక్టర్ నుంచి జారిపడి విద్యార్థి కొక్కు మణికంఠ మృతి చెందాడు. పొట్లపాలెం నుంచి బుద్దాలపాలెం మట్టితోలుతున్న ట్రాక్టర్‌పై మట్టి ట్రిప్పుల లెక్కలు చూస్తున్న కొక్కు మణికంఠ డ్రైవర్ మహేష్ పక్కన కూర్చున్నాడు. పొట్లపాలెం గతుకుల రోడ్డు వద్ద ట్రాక్టర్‌పై కూర్చున్న మణికంఠ కిందపడిపోయాడు. ట్రక్కు మణికంఠ పైనుంచి వెళ్లి అక్కడికక్కడే మృతి చెందాడు. తండ్రి కొండలరావు, తల్లి కుమారి, చెల్లెలు విలపిస్తున్న తీరు అందరి హృదయాలను కలచివేసింది. మృతదేహాన్ని ప్రభుత్వాసుపత్రికి తరలించి ఎస్సై సత్యనారాయణ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కృష్ణా వర్సిటీకి భారతదేశ జాతీయ స్థాయి అవార్డు



అవార్డు అందుకుంటున్న వర్సిటీ రెక్టార్ ఎం.వి.బసవేశ్వరరావు

మచిలీపట్నం టౌన్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): కృష్ణా విశ్వవిద్యాలయానికి ప్రతిష్టాత్మకమైన జాతీయ స్థాయి అవార్డు దక్కింది విశ్వవిద్యాలయాల పనితీరు ఆధారంగా కృష్ణా విశ్వవిద్యాలయం మూడో స్థానంలో నిలవడం విశేషం. న్యూఢిల్లీలోని హోటల్ గ్రాండ్‌లో జరిగిన కార్యక్రమంలో విశ్వవిద్యాలయ రెక్టార్ ఎం.వి. బసవేశ్వరరావు, భారత క్రికెట్ కంట్రోల్ బోర్డు సభ్యుడు జతీన్ పరాన్ జపే చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. శాస్త్ర సాంకేతిక రంగాల్లో భారతదేశం సాధిస్తున్న విజయాలు, పొందుతున్న ఫలితాలపై కృష్ణావిశ్వవిద్యాలయం రెక్టార్ బసవేశ్వరరావు జాతీయ స్థాయి సమ్మేళనంలో ప్రసంగించారు. కృష్ణా విశ్వవిద్యాలయానికి అవార్డు దక్కడంతో ఉపకులపతి కూన రాంజీ హర్షం వ్యక్తం చేశారు.



మునిసిపల్ కమిషనర్ బాపిరాజుకు వినతిపత్రం అందజేస్తున్న న్యాయవాది సోడిశెట్టి బాలాజీ, పి.వి.ఫణికుమార్ తదితరులు

పట్టాభి భవనం ఎన్‌వోసీకి తీర్మానం చేయాలి

మచిలీపట్నం టౌన్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : హైకోర్టు తీర్పు మేరకు భోగరాజు పట్టాభి సీతారామయ్య స్మారక భవనాన్ని నిర్మిం చేందుకు అనుమతిస్తూ మచిలీపట్నం నగరపాలక సంస్థ కౌన్సిల్ తీర్మానం చేయాలని శుక్రవారం కమిషనరు బాపిరాజును పట్టాభి స్మారక భవన నిర్మాణ కమిటీ ఛైర్మన్, న్యాయవాది సోడిశెట్టి బాలాజీ కోరారు. ఈ మేరకు కమిషనర్ బాపిరాజుకు న్యాయవాది బాలాజీ, పి.వి. ఫణికుమార్ తదితరులు వినతిపత్రంతో పాటు హైకోర్టు తీర్పు కాపీని అందజేశారు. న్యాయవాదులు పుప్పాల ప్రసాద్, మాదివాడ వెంకట నరసింహారావు, కమిటీ ప్రతినిధులు ధూళిపాళ శ్రీరామచంద్రమూర్తి, పి.వి.ఎస్.ఆర్.కె.శర్మ, సూరి హరికృష్ణ, కొత్తగుండు రమేష్, వేమూరి పవన్‌సాయి తదితరులు పాల్గొన్నారు.



శ్రీకృష్ణదేవరాయల మహోత్సవం కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే మండలి, ఈవో

శ్రీకృష్ణదేవరాయల మహోత్సవం 14న

అవనిగడ్డ, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రుల తొలి రాజధాని శ్రీకాకుళంలో శ్రీకృష్ణదేవరాయల మహోత్సవం మే 14వ తేదీన నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ తెలిపారు. తన కార్యాలయంలో శుక్రవారం దేవదాయశాఖ అధికారులతో కలిసి శ్రీకృష్ణదేవ రాయల మహోత్సవం కరపత్రాలు ఆవిష్కరించారు. శ్రీకాకుళం గ్రామంలో మే 10 నుంచి 14వ తేదీ వరకు శ్రీకాకుళేశ్వరస్వామి కల్యాణ బ్రహ్మోత్సవాలు, 14న శ్రీ కృష్ణదేవరాయ మహోత్సవాలు జరుగు తాయన్నారు. శ్రీకృష్ణదేవరాయలు అముక్త మాల్యద గ్రంథ రచన చేయటం ద్వారా శ్రీకాకుళేశ్వరస్వామి దేవస్థానం ప్రాముఖ్యతను ద్విగుణీకృతం చేశారన్నారు. మహోత్సవాలను ప్రతి ఒక్కరూ విజయవంతం చేయాలన్నారు. ఎమ్మెల్యే తనయుడు మండలి వెంకట్రామ్, దేవదాయశాఖ డిప్యూటీ కమిషనర్ దాసరి శ్రీరామ వరప్రసాదరావు, ఆలయ సూపరింటెండెంట్ అచ్యుత మధుసూదనరావు, బర్మా ప్ర సాద్, తోట చెన్నకేశవ, పయ్యావుల నాగరాజు పాల్గొన్నారు.



ప్రతిభ చూపిన జడ్పీ విద్యార్థులకు సత్కారం

ఘంటసాల, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : ఘంటసా జడ్పీ ఉన్నత పాఠశాలలో టెన్త్‌లో ప్రతిభ చూపిన విద్యార్థులను గౌతమ్ టూటోరియల్స్ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా సత్కరించారు. ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు దేవరపల్లి సురేష్ మాట్లాడుతూ 95 శాతంపైగా మార్కులు సాధించిన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు రెండు సెంట్ల ఇంటి స్థలం మం జూరు చేసేలా ప్రభుత్వం చొరవ చూపాలన్నారు. ప్రతిభ చూపిన డి. జయ సింధున (573), చరణ్ తేజ (567), ఆకాష్ (561), స్రవంతి (534), నాగ కుమారి (524), సంజన (521) విద్యార్థులను ఘనంగా సత్కరించారు. మెరుగు ప్రశాంతి అధ్యక్షత న జరిగిన కార్యక్రమంలో డి.కోటయ్య, వేణుగోపాలరావు, పి.గోవర్ధన్‌రావు, సుబ్రహ్మణ్యం, మేడేపల్లి సుబ్బారావు, వెంకటేశ్వరరావు, దివ్య, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



మార్కెట్ కమిటీ ఛైర్‌పర్సన్ కనకదుర్గను సత్కరిస్తున్న రామకృష్ణ

ఘంటసాల మార్కెట్ కమిటీ ఛైర్‌పర్సన్ కనకదుర్గకు సత్కారం

మచిలీపట్నం టౌన్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : ఘంటసాల మార్కెట్ కమిటీ ఛైర్‌పర్సన్‌గా నియమితులైన తోట కనకదుర్గను శుక్రవారం మచిలీపట్నం జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి బండి రామకృష్ణ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. మార్కెట్ యార్డు డైరెక్టర్లు కోలపల్లి శ్రీవర్ధ, అంకాని నరేంద్ర, మచిలీపట్నం జనసేన నాయకులు గడ్డం రాజు, వడ్డి చిరంజీవి, తిరుమలశెట్టి రాజు, పినిశెట్టి వేణు, ఉడుముల బుజ్జి, తోట రాజేష్, రామానాయుడు, చలమలశెట్టి రమేష్, తోట భాస్కర్, నరహరిశెట్టి రామ్‌బాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

దుర్గా గణపేశ్వరస్వామి కల్యాణ మహోత్సవాలు ప్రారంభం

నాగాయలంక, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : గణపేశ్వరంలో కొలువైన శ్రీ దుర్గా గణపేశ్వరస్వామి, పార్వతీ సమేత సంగమేశ్వర స్వామి దివ్య కల్యాణ మహోత్సవాలు శుక్రవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. మొదటి రోజున స్వామివార్లు, అమ్మవార్లను పెండ్లి కుమారులు, పెండ్లి కుమార్తెలను చేసే కార్యక్రమాలను దుర్గా హరిబాబు బ్రహ్మత్వంలో వ్యవస్థాపక ధర్మకర్త మండల శ్రీరామచంద్రమూర్తి, అరుణ దంపతులు పాల్గొని నిర్వహించారు. ఆలయ ఈవో సిహెచ్.సుధాకరరావు, దేవాలయ సిబ్బంది పర్యవేక్షించారు.



బందరులో ర్యాలీ నిర్వహిస్తున్న న్యాయవాదులు



బందరులో ముస్లిం మహిళల నిరసన ప్రదర్శన



బంటుమిల్లిలో నిరసన తెలుపుతున్న ముస్లింలు



చల్లపల్లిలో కొవ్వొత్తులతో నివాళి అర్పిస్తున్న ముస్లింలు

ఉగ్రదాడిపై న్యాయవాదులు, ముస్లింల ఆగ్రహం

● నిరసన ప్రదర్శన ● మానవహారం ● మృతులకు కొవ్వొత్తుల నివాళి

మచిలీపట్నం టౌన్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : కాశ్మీరులో ఉగ్రవాదుల దుశ్చర్యలపై ప్రజాగ్రహం పెలుబికుతోంది. ఉగ్రవాదుల కిరాతక చర్యలను ఖండిస్తూ నిరసన ర్యాలీలు, మానవహారాలు కులమతాలు, రాజకీయాలకతీతంగా చేపట్టారు. ఉగ్రమూకపై కఠిన చర్యలు తీసుకోవాలంటూ మచిలీపట్నంలో న్యాయవాదులు విధులు బహిష్కరించారు. నిరసన ప్రదర్శన నిర్వహించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు దివి పోతురాజు ఆధ్వర్యంలో నిర్వహించిన నిరసన ప్రదర్శనలో మచిలీపట్నం బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి శాయన సుధాకర్, న్యాయవాదులు కూనపరెడ్డి శ్రీనివాసరావు, పి.వి.వెంకటేశ్వరరావు, అగస్త్య సత్యనారాయణ, మొహమ్మద్ రఫీ, అజ్మతున్నీసా, కె.జయభాగ్యరాజ్, గుండు ప్రకాష్‌రావు, ఎన్.బాలసుబ్రహ్మణ్యం, విజయరాజు తదితరులు పాల్గొన్నారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు దివి పోతురాజు మాట్లాడుతూ, పహల్గాంలో ఉగ్రవాదులు జరిపిన మారణకాండను ముక్తకంఠంతో ప్రతి భారతీయుడు ఖండించాలన్నారు. ఉగ్రవాద సంస్థలపై చర్యలు చేపట్టేందుకు కేంద్రం ముందుకు రావాలన్నారు.

ముస్లిం మహిళల నిరసన

మచిలీపట్నం టౌన్ : పెహల్గాంలో ఉగ్రవాదుల మారణ హోమాన్ని నిరసిస్తూ శుక్రవారం రాత్రి ముస్లిం మహిళలు భారీ ర్యాలీ నిర్వహించారు. కోనేరు సెంటర్ నుంచి రాజుపేట మసీదు వరకు నిర్వహించిన ఈ ర్యాలీలో న్యాయవాది అజ్మతున్నీసా తదితరులు నినాదాలు చేశారు. ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. హిందూ ముస్లిం ఐక్యత వర్ధిల్లాలంటూ ముస్లిం మహిళలు నినాదాలు చేశారు. కెకెఆర్ గౌతం విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. యూనియన్ బ్యాంకు ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. **బంటుమిల్లి** : కాశ్మీర్‌లోని పెహల్గాంలో ఉగ్రవాదుల దాడిని ఖండిస్తూ బంటుమిల్లిలో ముస్లింలు శుక్రవారం నిరసన తెలిపారు. మృతుల ఆత్మకు శాంతి కలగాలని కోరుతూ ఖాదరి జామియా మసీదులో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మసీదు ఎదుట నిరసన తెలియజేశారు. పెహల్గాం దుర్ఘటనకు పాల్పడిన వారిని క్షమించరాదన్నారు. దుర్మార్గులు ఎక్కడ దాగి ఉన్నా కఠినంగా శిక్షించాలని కోరారు. ఖాదరి జామియా మసీదు గురువు ఖామూరు జమ, మత పెద్దలు ఎండీ కమల్, ఎండీ నజీర్, షేక్ బాషీ, షేక్ జిలానీ, అక్బర్ కరీం, ఖలీల్, మహబూ తదితరులు పాల్గొన్నారు. చల్లపల్లి : పెహల్గామ్ ఉగ్రదాడిలో మృతిచెందిన పర్యాటకులకు చల్లపల్లిలో ముస్లింలు నివాళులు అర్పించారు. పెద్దమసీదు నుంచీ కొవ్వొత్తులు చేతబూని ప్రదర్శన చేసి ప్రధాన సెంటర్లో నివాళులు అర్పించారు. మసీదు కమిటీ అధ్యక్షుడు షేక్ నసీంఘోరి, వార్డు సభ్యుడు మీర్ రిజ్వాన్, కోఆప్షన్ సభ్యుడు షేక్ నబీఘోరి, అర్షద్, మసీదు గురువులు, ముస్లిం పెద్దలు తదితరులు పెద్దఎత్తున పాల్గొన్నారు. చల్లపల్లి సీఐ కె.ఈశ్వరరావు పాల్గొని మృతులకు నివాళులు అర్పించారు. చల్లపల్లి, ఘంటసాల మండలాల జనసేన సంయుక్త ఆధ్వర్యంలో విజయక్రాంతి విద్యార్థులతో కలిసి శుక్రవారం ఉదయం ప్రధాన వీధుల్లో ప్రదర్శన నిర్వహించారు. ఏఎంసీ ఛైర్మన్ తోట కనకదుర్గ, బొందలపాటి వీరబాబు, సిద్ధినేని కుమార్‌రాజా, సూదాని నందగోపాల్, ఉరిమి మణికాంత్, తోట మురళీకృష్ణ, యార్ల శ్రీకాంత్, గోళ్ల ప్రసాద్, కలపాల ప్రసాద్, నూకల నరేష్, పసుపులేటి రవికుమార్, అడపా రవి, రాయవరపు నాంచారయ్య, రావి రాజు పాల్గొన్నారు.

ఉగ్రవాదం అంతానికి కలిసి రావాలి

అవనిగడ్డ : ఉగ్రవాదం అంతానికి భారతీయులు ఐక్యం కావాలని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ పిలుపునిచ్చారు. మృతుల ఆత్మకు శాంతిని కాంక్షిస్తూ రాజీవ్‌గాంధీ విగ్రహం సెంటర్‌లో మానవహారం నిర్వహించారు. ఎమ్మెల్యే తనయుడు మండలి వెంకట్రామ్, జనసేన జిల్లా ఉపాధ్యక్షుడు మత్తి వెంకటేశ్వరరావు, జిల్లా అధికార ప్రతినిధి రాయపూడి వేణుగోపాలరావు, ఏఎంసీ ఛైర్మన్లు కొల్లూరి వెంకటేశ్వరరావు, తోట కనకదుర్గ, ఎంపీటీసీ సభ్యులు బొప్పన భాను, డీసీ వైస్ ఛైర్మన్ బచ్చు రఘునాథ్ ప్రసాద్, బండే కనకదుర్గ, తుంగల వెంకటగిరి, శోభిల ఏడుకొండలు, రాజనాల వీరబాబు, బచ్చు కృష్ణకుమారి, బండే రాఘవ, బొప్పన సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు. **మోపిదేవి** : కశ్మీర్‌లో ఉగ్రదాడిని ఖండిస్తూ మోపిదేవిలో మానవహారం నిర్వహించారు. దివి గ్రామీణ యువజన వికాస సమితి అధ్యక్షులు మండలి వెంకట్రామ్, టీడీపీ, జనసేన, బీజేపీ మండల పార్టీల అధ్యక్షులు నడకుదుటి జనార్ధనరావు, పూషడపు రత్నగోపాల్, సనకా ప్రశాంత్, జనసేన ఉమ్మడి కృష్ణా జిల్లా పార్టీ ఉపాధ్యక్షులు మత్తి వెంకటేశ్వరరావు, పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. **కోడూరు** : పర్యాటకులను ఉగ్రవాదులు పొట్టన పెట్టుకోవటం అమానుషమని పీసీ ఛైర్మన్ దేవనబోయిన వెంకటేశ్వరరావు అన్నారు. కోడూరు ప్రధాని సెంటర్‌లో మానవహారం, నిరసన ప్రదర్శన నిర్వహించారు. మండల పార్టీ అధ్యక్షులు మర్రే గంగయ్య, కొండవీటి సునీత, కోట రాంబాబు, బచ్చు వెంకటేష్, కాగిత రామారావు, పూతబోయిన కరుణకుమార్, పూతబోయిన సాయిబాబు, గుడిసేవ సూర్యనారాయణ, బాను ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



అవనిగడ్డ ర్యాలీలో ఎమ్మెల్యే మండలి



మోపిదేవిలో మానవహారం



కోడూరులో..



చల్లపల్లిలో..



చేనేత క్లస్టర్‌పై సమీక్షలో పాల్గొన్న ఎమ్మెల్యే కాగిత, కలెక్టర్ బాలాజీ

చేనేత క్లస్టర్‌కు భవనాలు కేటాయించాలి

పెడన, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : పెడనలో కలంకారీ క్లస్టర్ ఏర్పాటుకు అవసరమైన భవనాలు, స్థలాలు త్వరితగతిన కేటాయించాలని కలెక్టర్ బాలాజీ అధికారులను ఆదేశించారు. పెడనలో కలంకారీ క్లస్టర్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం అమలు విషయమై కలెక్టర్ కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్, రాష్ట్ర బీసీ కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ బొడ్డు వేణుగోపాలరావు, జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మ, జిల్లా పరిశ్రమల అధికారి వెంకట్రావు, కలంకారీ ఆర్టిజన్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు బళ్ల ప్రసాద్, జంపాన శ్రీనివాసులు పాల్గొన్నారు

లంకమ్మ హుండీ ఆదాయం రూ.7.59 లక్షలు

అవనిగడ్డ, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : దివిసీమ వాసుల ఇలవేల్పు లంకమ్మ అమ్మవారి హుండీల కానుకలు శుక్రవారం లెక్కించగా, రూ.7.59 లక్షలు వచ్చినట్లు దేవదాయశాఖ అధికారులు తెలిపారు. 22 రోజులకు అమ్మవారి వార్షిక జాతరను పురస్కరించుకుని రూ.7,59,770 ఆదాయం వచ్చినట్లు మచిలీపట్నం దేవాలయాల తనిఖీ అధికారి శ్రీనివాస్ తెలిపారు. గత సంవత్సరం కన్నా రూ.75 వేలు ఆదాయం పెరిగిందని ఈవో యార్లగడ్డ శ్రీనివాస్ తెలిపారు. ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

కిశోర బాలికలకు వికాస శిక్షణ

బంటుమిల్లి, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : బంటుమిల్లి స్త్రీ శిశు సంక్షేమ శాఖ కార్యాలయంలో శుక్రవారం కిశోర బాలికల వికాస శిక్షణ కార్యక్రమం జరిగింది. ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి ఎం సముద్రవేణి మాట్లాడుతూ బాలికల అక్రమ రవాణా, అత్యాచారాల నివారణ, బాల్య వివాహాలు నిరోధం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. డాక్టర్ పవన్ యుక్త వయసులో వచ్చే మార్పులను, తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఏపీఎం దశరథరామయ్య మాట్లాడుతూ చిన్ననాటి నుండే పొదుపు అలవాటు చేసుకోవాలన్నారు. సూపర్‌వైజర్ నాగలక్ష్మి, సుమిత్ర అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

కార్యదర్శికి భావదేవరపల్లి పౌర సన్మానం



నాగాయలంక, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : భావదేవరపల్లిలో పంచాయతీ కార్యదర్శిగా పని చేస్తున్న పి.మల్లిఖార్జునరావు గణపేశ్వరం బదిలీ అయ్యారు. నాగాయలంక పంచాయతీకి అదనపు కార్యదర్శిగా వ్యవహరిస్తారు. భావదేవరపల్లి సర్పంచ్ మండలి ఉదయ భాస్కర్, ఈవోపీఆర్డీ కె.అప్పల నరసమ్మ, సచివాలయ సిబ్బంది, గ్రామస్థులు ఈ శుక్రవారం కార్యదర్శి మల్లిఖార్జునరావును ఘనంగా సత్కరించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కోడూరు, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : పలు గ్రామాల్లో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఇన్‌చార్జి ఏఈ గోపిచంద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ లైన్ల పనుల కారణంగా శనివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు బస్టాండ్ సెంటర్ (ఎస్ఎస్13), ఎస్టీ కాలనీ, ముందడుగు, స్వతంత్రపురం, శ్రీరాంపురం, హంసలదీవి, పాలకాయితిప్ప గ్రామాలకు, చెరువులకు, ఉల్లిపాలెం, వేణుగోపాలపురం చెరువులకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందన్నారు. ప్రజలు సహకరించాలని కోరారు.

ఉపాధి కూలీలకు కనీస వసతులు కల్పించండి

మోపిదేవి, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : ఎండలను దృష్టిలో ఉంచుకుని ఉపాధి కూలీలకు కనీస మౌలిక వసతులు కల్పించాల్సిందిగా సీఐటీయూ మండల కార్యదర్శి చిరివేళ్ల రాజశేఖర్ డిమాండ్ చేశారు. శుక్రవారం మండలంలోని మోపిదేవిలంక గ్రామంలో పని చేస్తున్న కూలీల వద్దకు వెళ్లి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఎండల నేపథ్యంలో కూలీలకు నీడ వసతి, మజ్జిగ కల్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు. కూలీ రేటుకు అదనంగా అలవెన్సు తక్షణమే అమలు చేయాలని కోరారు.

సీఎం సాయం చెక్కుల పంపిణీ



కృత్తివెన్ను, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : సీఎం ఆదేశం మేరకు ప్రజలకు అందుబాటులో ఉంటూ, సమస్యలను గ్రీవెన్స్ డే అన్ని మండలాల్లో నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ తెలిపారు. కృత్తివెన్ను టీడీపీ కార్యాలయంలో శుక్రవారం గ్రీవెన్స్ డే నిర్వహించారు. సమస్యలపై అర్జీలను స్వీకరించారు. పలువురికి సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులను ఆయన అందజేశారు. మండల టీడీపీ అధ్యక్షుడు, మల్లేశ్వరం మార్కెట్ యార్డు ఛైర్మన్ ఒడుగు తులసీరావు, డీసీ ఛైర్మన్ నెక్కంటి భాస్కరరావు, కార్యదర్శి పిన్నెంటి రత్తయ్య, నాయకులు కూనసాని చిన్న, యాదంరెడ్డి కొండ, కూనసాని శ్రీనివాసరావు, చిలుకూరి చంద్రశేఖర్, నడకుదిటి ఆంజనేయులు, చేకూరి వెంకట్రావు, అధికారి శ్రీనివాసరావు, జనసేన నేత తిరుమాని రామాంజనేయులు పాల్గొన్నారు.



సనాతన ధర్మ పరిరక్షణ కరపత్రాలు ఆవిష్కరిస్తున్న లక్ష్మీ నరసింహమూర్తి

సనాతన ధర్మ పరిరక్షణలో పురోహితుల పాత్ర కీలకం

మచిలీపట్నం టౌన్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : సనాతన ధర్మపరిరక్షణలో అర్చకులు, పురోహితుల పాత్ర కీలకమని హిందూ జనసంఘ్ వ్యవస్థాపకుడు విశ్వావఝుల లక్ష్మీనరసింహమూర్తి అన్నారు. ఎరామలింగేశ్వర స్వామి దేవస్థానంలో శుక్రవారం రాత్రి జరిగిన కార్యక్రమంలో లక్ష్మీనరసింహమూర్తి మాట్లాడారు. సనాతన ఆచార వ్యవహారాలపై రూపొందించిన కరపత్రాలు, వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఎం.సుబ్రహ్మణ్యం, పి.వి. ఫణికుమార్, రామకృష్ణ శర్మ, జొన్నలగడ్డ భాస్కరశర్మ, కానుకొలను ఫణికిరణ్‌శర్మ, హరినాథ్ శర్మ, చంద్రశేఖర శర్మ పాల్గొన్నారు.

అవసరమైన వారికి ప్రభుత్వం న్యాయసహాయం



సదస్సులో మాట్లాడుతున్న న్యాయాధికారి కె.వి.రామకృష్ణయ్య

పెడన, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : ఆర్థిక ఇబ్బందులు, చట్టాలపై అవగాహన లేకపోవడం వంటి కారణాలతో న్యాయం పొందలేకపోతున్న వారికి న్యాయ సహాయం అందించేందుకు న్యాయసేవాధికార సంస్థ కృషి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.వి. రామకృష్ణయ్య అన్నారు. ఎస్టీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఇందిరా కాలనీలో శుక్రవారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ముదిగొండ ఫణిధూర్జటి, మణికంఠ, బాలభాస్కర్, కె. చంద్రమోహన్, సేనాపతి అజయ్ పాల్గొన్నారు.

గూడూరు దర్గాలో ఎమ్మెల్యే కాగిత పూజలు

గూడూరు, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : గూడూరు పఠాన్‌పేటలోని హజ్రత్ నిర్గన్‌షా ఔలియా దర్గాలో ఉరుసు మహోత్సవాలలో భాగంగా రెండో రోజు శుక్రవారం ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ పాల్గొని బాబాను దర్శించుకున్నారు. పోతన స్వామి, ఎస్ఏ బేగ్, దర్గా కమిటీ ఛైర్మన్ మహమ్మద్ యాసిన్, సర్పంచ్ మహమ్మద్ రఫీ, మాజీ సర్పంచ్ పోతన రామోజీ, పుప్పాల సురేష్, మొహమ్మద్ రెహమాన్, విజయ్, బేతాళ స్వామి, చింతగుంట కృష్ణ, సిరివెళ్ళ శ్రీను, మౌలాలి, జోహరి, రామాంజనేయులు, కిరణ్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే పిల్లలను చేర్పించాలి

చల్లపల్లి, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలల్లోనే పిల్లలను చేర్పించాలని కోరుతూ నారాయణరావు నగర్ మోడల్ ప్రైమరీ పాఠశాల హెచ్‌ఎం కైతేపల్లి దాస్ శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. ముస్లింలతో కలిసి ర్యాలీగా కాన్వెంట్‌లో చదివే పిల్లల ఇళ్లకు వెళ్లి కాలనీలో అందుబాటులో ఉన్న పాఠశాలలో పిల్లలను చేర్పించాలని విజ్ఞప్తి చేశారు. ఎనిమిది మంది తల్లిదండ్రులుపిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేరుస్తూ అంగీకారాలు తెలియచేశారు. కోఆప్షన్ సభ్యుడు షేక్ నబీఘోరి, ఎస్ఎం. షరీఫ్, షేక్ ఇబ్రహీం, షేక్ కరీముల్లా, గౌస్, చాన్, సయ్యద్ మీర్, అబ్దుల్ గౌస్, అర్షద్, ఇసాం తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కమిషనర్‌ను కలిసిన దుకాణదారులు



గుడివాడ, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి) : గుడివాడ పురపాలక సంఘం కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన సింహాద్రి మనోహర్‌ను శుక్రవారం ఆయన చాంబర్‌లో మున్సిపల్ దుకాణదారుల అసోసి యేషన్ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. అసోసి యేషన్ అధ్యక్షులు కె.డి.వి.ఎన్ శ్రీనివాస్, రాయపల్లి కృష్ణ, సయ్యద్ గఫార్, సప్పా అప్పారావు, మెండం సుధాకర్, చుండి వేణు, మల్లి, శివ, కొత్త సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

కూలే స్థితిలో వంతెన!

● భయం..భయంగా ప్రయాణం

(ఆంధ్రజ్యోతి-గుడివాడ రూరల్)

మండలంలోని సిద్ధాంతం - పెద ఎడ్లగాడి ప్రధాన రహదారి సిద్ధాంతం వద్ద పంట కాలువపై ఉన్న వంతెన ఏ క్షణమైనా కూలేందుకు సిద్ధంగా ఉంది. రెండు పక్కల రెయిలింగ్ విరిగిపోవటంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. గుడివాడ పట్టణం వెళ్లకుండా కైకలూరు, ముదినేపల్లి నుంచి వచ్చే వాహనాలు బైపాస్‌గా బందరు, పామర్రు వెళ్లటానికి ఇది అతి ప్రధాన రహదారిగా ఉంది. ఈ రహదారిలో పంట కాలువపై 1950వ సంవత్సరంలో వంతెన నిర్మించారు. వంతెన నిర్మించి 75 సంవత్సరాలు పూర్తి చేసుకుంది. భారీ వాహనాలు, వ్యవసాయ పనులు చేసుకునే రైతులు ధాన్యం, వరిగడ్డి ట్రాక్టర్లు, లారీల ద్వారా ఈ వంతెన మీదుగా వెళ్తుంటాయి. మలుపులో ఏ మాత్రం అజాగ్రత్తగా ఉన్నా వాహనం మొత్తం కాల్వ పడే అవకాశం ఉంది. ముఖ్యంగా రాత్రి సమయంలో ఈ వంతెనపై ప్రయాణం ప్రాణసంకటమే, సుమారు 40 గ్రామాల ప్రజలు ఈ వంతెన పైనుండే వేలాది మంది ద్విచక్ర, భారీ వాహనాలతో నిత్యం ప్రయాణం చేస్తారు. ఏ క్షణం ఏమి జరుగుతుందోనని బిక్కు బిక్కు మంటూ ప్రయాణాలు సాగిస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి వంతెన నిర్మాణం చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



సిద్ధాంతం వద్ద కూలటానికి సిద్ధంగా ఉన్న వంతెన



బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమంలో ప్రసంగిస్తున్న యలవర్తి

ముగిసిన పంచాయతీరాజ్ ఉద్యోగుల ఆటల పోటీలు

గుడివాడ, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా గత మూడు రోజులుగా నిర్వహిస్తున్న పంచాయతీరాజ్ ఉద్యోగుల స్పోర్ట్స్ అండ్ కల్చరల్ మీట్ గురువారం రాత్రి ముగిసింది. స్టేడియం కమిటీ ఉపాధ్యక్షుడు యలవర్తి శ్రీనివాసరావు విజేతలకు బహుమతులు అందజేశారు. యలవర్తి మాట్లాడుతూ, నిత్యం పనిలో తీరిక లేకుండా తిరుగుతుండే పంచాయతీరాజ్ ఉద్యోగులకు ఆటల పోటీలను నిర్వహించడం అభినందనీయమన్నారు. జిల్లా పంచాయతీ అధికారికి ఉత్తమ డీపీవో అవార్డు రావడం అభినందనీయమన్నారు. స్టేడియం కమిటీ సంయుక్త కార్యదర్శి కిలారపు రంగప్రసాద్, డీఎల్‌పీవో సంపత్‌కుమారి, మచిలీపట్నం ఇన్‌చార్జి డీఎల్‌పీవో అప్పలనరసమ్మ, పీడీ జ్యోతి, ఈవోపీఆర్డీ శైలజకుమారి, వెంకటేశ్వరమ్మ, భారతి, పీడీలు సతీష్‌కుమార్, బాలభాస్కర్, కృష్ణ, స్పోర్ట్స్ కమిటీ సభ్యుడు భట్రాజు కోటయ్య, పెదపారుపూడి ఇన్‌చార్జి ఎంపీడీవో వంగా శ్రీనివాస్ పాల్గొన్నారు.

చీరల పంపిణీ

బైపాస్ రోడ్డులోని మమత వృద్ధాశ్రమంలో శుక్రవారం శ్రీకృష్ణ యాదవసేవాసంఘం ఆధ్వర్యంలో ముదినేపల్లి మండలం పేరూరు గ్రామానికి చెందిన సోమ సత్యనారాయణ, రామలక్ష్మి 24వ పెళ్లిరోజు సందర్భంగా వృద్ధులకు చీరలు పంపిణీ చేశారు. స్టేడియం కమిటీ ఉపాధ్యక్షుడు యలవర్తి శ్రీనివాసరావు, మాజీ కౌన్సిలర్ వసంతవాడ దుర్గారావు, సేవాసంఘం రాష్ట్ర అధ్యక్షుడు పుట్టి హరికుమార్, సభ్యులు తిరుపతయ్య, తాతారావు, హరిబాబు, రామారావు, టీడీపీ నాయకులు వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

వీరమ్మతల్లికి విశేష పూజలు



గుడ్లవల్లేరు, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : మామిడికోళ్ల వీరమ్మతల్లి ఆలయ, విగ్రహ ప్రతిష్ఠా మండల మహోత్సవాలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి క్షీర,సుగంధ ద్రవ్యాభిషేకం, కలశాభిషేకం నిర్వహించి ప్రత్యేక పూజలు జరిపారు. ఆలయ కమిటీ సభ్యులు విశేష స్నపన, హోమం, పూజాది కార్యక్రమాలలో పాల్గొన్నారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు.పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఆలయం చెరువు వేలంపాట 6న

గుడివాడ రూరల్, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి) : మోటూరులో వేంచేసి ఉన్న సీతారామస్వామివారి దేవాలయం పరిధిలోని కుదరవల్లి గ్రామంలో ఉన్న 6.98 ఎకరాల చేపల చెరువుకు మే 6వ తేదీ ఉదయం 11 గంటలకు దేవాలయం వద్ద వేలం పాట నిర్వహిస్తున్నట్లు ఆలయ మేనేజర్ గోరిపర్తి నాగమౌనిక శుక్రవారం తెలిపారు. పెద ఎరుకపాడు గ్రామంలో వేంచేసి ఉన్న రామలింగేశ్వరస్వామివారి దేవాలయానికి చెందిన 2.86 ఎకరాల దేవస్థానం భూమి కౌలు వేలంపాట కూడా మే నెల 6వ తేదీ 12 గంటలకు దేవస్థానం వద్ద బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజలు వేలం పాటలో పాల్గొనాలని కోరారు.

శ్రీకృష్ణదేవరాయల మహోత్సవం 14న

అవనిగడ్డ, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రుల తొలి రాజధాని శ్రీకాకుళంలో శ్రీకృష్ణదేవరాయల మహోత్సవం మే 14వ తేదీన నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ తెలిపారు. తన కార్యాలయంలో శుక్రవారం దేవదాయశాఖ అధికారులతో కలిసి శ్రీకృష్ణదేవరాయల మహోత్సవం కరపత్రాలు ఆవిష్కరించారు. శ్రీకాకుళం గ్రామంలో మే 10 నుంచి 14వ తేదీ వరకు శ్రీకాకుళేశ్వరస్వామి కల్యాణ బ్రహ్మోత్సవాలు, 14న శ్రీ కృష్ణదేవరాయ మహోత్సవాలు జరుగుతాయన్నారు. మహోత్సవాలను ప్రతి ఒక్కరూ విజయవంతం చేయాలన్నారు. ఎమ్మెల్యే తనయుడు మండలి వెంకట్రామ్, దేవదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ దాసరి శ్రీరామ వరప్రసాదరావు, ఆలయ సూపరింటెండెంట్ అచ్యుత మధుసూదనరావు, బర్మా ప్రసాద్, తోట చెన్నకేశవ, పయ్యావుల నాగరాజు పాల్గొన్నారు.

ట్రాక్టర్ నుంచి జారిపడి విద్యార్థి మృతి

మచిలీపట్నం టౌన్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : పొట్లపాలెం వద్ద ట్రాక్టర్ నుంచి జారిపడి విద్యార్థి కె. మణికంఠ మృతి చెందాడు. పొట్లపాలెం నుంచి బుద్దాలపాలెం మట్టితోలుతున్న ట్రాక్టర్‌పై మట్టి ట్రిప్పుల లెక్కలు చూస్తున్న మణికంఠ డ్రైవర్ మహేష్ పక్కన కూర్చున్నాడు. పొట్లపాలెం గతుకుల రోడ్డు వద్ద ట్రాక్టర్‌పై కూర్చున్న మణికంఠ కిందపడిపోయాడు. ట్రక్కు మణికంఠ పైనుంచి వెళ్లి అక్కడికక్కడే మృతి చెందాడు. తండ్రి కొండలరావు, తల్లి కుమారి, చెల్లెలు విలపిస్తున్న తీరు అందరి హృదయాలను కలచివేసింది.

ప్రజాసమస్యల పరిష్కారానికే ప్రజాదర్బార్

ఎమ్మెల్యే వెనిగండ్ల రాము

గుడివాడ, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : ప్రజాసమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రజాదర్బార్ నిర్వహిస్తున్నామని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. ప్రజావేదికలో శుక్రవారం ప్రజాదర్బార్ నిర్వహించి, ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. ప్రజాసమస్యలను అడిగి తెలుసుకుని సంబంధిత శాఖల అధికారులకు ఫోన్ చేసి తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజావేదిక కార్యాలయం నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటుందని పేర్కొన్నారు ఎన్టీఆర్ స్టేడియం కమిటీ ఉపాధ్యక్షుడు యలవర్తి శ్రీనివాసరావు, నాయకులు మురళీ, దానేటి సన్యాసిరావు, చాట్రగడ్డ రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.



నీటి పంపింగ్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వెనిగండ్ల రాము

పట్టణాభివృద్ధిపై దృష్టి సారించండి

ప్రజాసమస్యల పరిష్కారం, పట్టణాభివృద్ధిపై దృష్టి సారించాలని మున్సిపల్ కమిషనర్ సింహాద్రి మనోహర్‌కు ఎమ్మెల్యే వెనిగండ్ల రాము సూచించారు. రాజేంద్రనగర్‌లోని స్వగృహంలో ఎమ్మెల్యే వెనిగండ్లను కమిషనర్ మనోహర్ మర్యాదపూర్వకంగా కలిశారు. మున్సిపల్ అధికారులు, సిబ్బంది సమన్వయం చేసుకుంటూ పట్టణాభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. పట్టణ స్థితిగతులపై చర్చించారు.

● ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన విలేకరి గూడపాటి రాజును ఎమ్మెల్యే వెనిగండ్ల రాము పరామర్శించారు. పెదఎరుకపాడులోని రాజు గృహానికి వెళ్లి మాట్లాడి ప్రమాద వివరాలను అడిగి తెలుసు కున్నారు. పెద్దు శ్రీకాంత్, గూడపాటి ప్రకాష్‌బాబు, పాత శ్యామ్, మహ్మమద్ జబీవుల్లా, గూడపాటి గోపాలకృష్ణ, మాగంటి వెంకటేశ్వరరావు, ఓలేటి రాజేష్, దండా బత్తిన జోసఫ్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి రానియొద్దు

వేసవిలో పట్టణ ప్రజలకు ఇబ్బందుల కలుగకుండా, నీటి సరఫరాకు అన్ని విధాలుగా చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము పేర్కొన్నారు. శుక్రవారం వాటర్ వర్క్స్‌ను అధికార యంత్రాంగంతో కలిసి పరిశీలించారు. పాత, కొత్త స్టోరేజ్ ట్యాంకుల్లో నీటిని నింపే ప్రక్రియను పరిశీలించారు. ట్యాంకుల్లో నీటి సామర్థ్యాన్ని పెంచేందుకు అదనపు మోటార్‌లను ఏర్పాటు చేయాలని సూచించారు. అనంతరం పట్టణ అభివృద్ధి, శానిటేషన్ మెరుగు సమస్యలపై మున్సిపల్ కార్యాలయంలో అధికారులతో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ సింహాద్రి మనోహర్, అసిస్టెంట్ కమీషనర్ వి.శ్రీనివాసరావు, ఏసీపీ ఏసుబాబు, మున్సిపల్ ఈఈ ప్రసాద్, మేనేజర్ జి.టి. నాయుడు, డీఈలు వరప్రసాద్, సతీష్‌చంద్ర, శివాజీ, ఏఈలు షేక్ రఫీ, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ మలేరియా దినోత్సవ ర్యాలీ

గుడివాడ, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి) : ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా శుక్రవారం బాపూజీనగర్‌లోని అర్బన్ హెల్త్ సెంటర్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించి ర్యాలీ నిర్వహించారు. కమ్యూనిటీసూపర్‌వైజర్ వి.రామారావు, భారత్ వికాస్ పరిషత్ అధ్యక్షురాలు తిరుమలశెట్టి హరిక, సభ్యులు పాల్గొన్నారు. ఎన్టీఆర్ స్టేడియం వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మలేరియా నివారణపై ప్లకార్డులతో ప్రదర్శన నిర్వహించారు. తారకరామా వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు మెరుగుమాల బ్రహ్మయ్య, కార్యదర్శి చలువాది మోహనరావు, జిల్లా గవర్నర్ సనకా సుబ్బారావు, జిల్లా కోశాధికారి చిన్నం గంగాధరరావు, సామి రామ్మోహనరావు తదితరులు పాల్గొన్నారు. పెదపారుపూడి : వెంట్రప్రగడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ సందీప్ దోమల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. సిహెచ్‌వో కె.పద్మలత,పీహెచ్ఎన్ టి.ఆర్.రాజేశ్వరి దేవి, నగేష్, ప్రసాద్, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.



బాపూజీనగర్ హెల్త్ సెంటర్ ఆధ్వర్యంలో..



పామర్రు మార్కెట్ యార్డులో విభిన్న ప్రతిభావంతులకు ప్రభుత్వ ఉపకరణాలందిస్తున్న ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా

దివ్యాంగులు ఆత్మగౌరవంతో ముందుకుసాగాలి

పామర్రు, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : దివ్యాంగుల ఆత్మగౌరవం కాపాడడమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే వర్లకుమార్‌రాజా అన్నారు. పామర్రు వ్యవసాయ మార్కెట్ యార్డులో శుక్రవారం జిల్లా వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని 147 మంది విభిన్న ప్రతిభావంతులకు రూ.33.31 లక్షల విలువైన ఉపకరణాలను పంపిణీ చేశారు. ఎంపీడీవో కె.జ్యోతి, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి తాడిశెట్టి నరేష్, కృష్ణాడెల్టా ప్రాజెక్టు కమిటీ వైస్‌చైర్మన్ వల్లూరిపల్లి గణేష్, ఆరుమళ్ల అనితారెడ్డి, మంతెన రామాంజనేయులు, చాట్ల రమేష్ పాల్గొన్నారు.

ఉగ్రదాడులు పిరికిపంద చర్య

గుడివాడ, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి) : కశ్మీర్‌లోని పెహల్గాంలో అమాయకులపై దాడి చేసి హత్య చేసిన ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ప్రజావేదిక వద్ద జనసేన పార్టీ పిలుపు మేరకు జనసేన ఇన్‌చార్జి బూరగడ్డ శ్రీకాంత్ ఆధ్వర్యంలో నిర్వహించిన మానవహారంలో ఎమ్మెల్యే వెనిగండ్ల రాము పాల్గొన్నారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉగ్రవాద దాడిలో అమాయక ప్రజలు మృతి చెందటం బాధాకరమన్నారు. దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని కోరారు. ఎన్టీఆర్ స్టేడియం కమిటీ ఉపాధ్యక్షుడు యలవర్తి శ్రీనివాసరావు, టిడిపి నాయకులు జగన్మోహనరావు, మురళీ, వీరమాచనేని శైలజ, జనసేన నాయకులు శ్రీనివాసరావు, త్రినాద్, రాజేష్, చింతా రామకృష్ణ, వెంకట్రావు, గజేంద్ర, మీరా షరీఫ్, వెంకట్, సౌమ్య, భవాని, దుర్గ తదితరులు పాల్గొన్నారు.

కూచిపూడి : పెహల్గాం పర్యాటకులపై ఉగ్రవాదులు విచక్షణా రహితంగా కాల్పులు జరిపి అమాయక ప్రజలను బలి తీసుకున్న ఘటనకు నిరసనగా కూచిపూడిలో శుక్రవారం కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ప్రపంచ దేశాలన్ని ఉగ్రదాడులపై ధ్వజమెత్తి పాకిస్తాన్‌కు తగిన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. కూచిపూడి శివాలయం నుంచి పెదపూడి శివాలయం వరకు ర్యాలీ సాగింది. దోనేపూడి శివరామయ్య, వీరంకి తులసీదాస్, పోలన అశోక్ కుమార్, రాజులపాటి మురళీ, ఎస్ఎస్ఆర్.ఆంజనేయులు, తాతా శేషుబాబు, చిమటా రాఘవేంద్రరావు, మద్దాల కామేశ్వరరావు, కూచిపూడి, పెదపూడి గ్రామాలకు చెందిన ప్రజలు పాల్గొన్నారు.



మానవహారంలో పాల్గొన్న ఎమ్మెల్యే వెనిగండ్ల, బూరగడ్డలు



ఉగ్రదాడులకు నిరసనగా కూచిపూడిలో కొవ్వొత్తుల ర్యాలీ

గుడ్లవల్లేరు : పెహల్గాం ఉగ్రదాడిలో ప్రాణాలుకోల్పోయిన మృతులకు నివాళిగా శ్రీసాయి విద్యానికేతన్ విద్యార్థులు శుక్రవారం మౌనం పాటించారు. పాఠశాల నుంచి సంతబజార్ కు నిర్వహించిన శాంతి ర్యాలీ జరిపారు. పాఠశాల నిర్వాహకుడు సింగంశెట్టి ఆదినారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తోట్లవల్లూరు : పహల్గాంలో ఉగ్రవాదుల కాల్పుల్లో మృతిచెందిన పర్యాటకులకు సంతాపం తెలియజేస్తు, ఉగ్రవాదుల్ని అంతమొందించాలని కోరుతు శుక్రవారం రాత్రి వల్లూరుపాలెంలో హెల్పింగ్ హ్యాండ్ స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు చింతపల్లి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ జరిగింది. పార్టీలకు, కులాలకు అతీతంగా ఉగ్రవాదాన్ని ప్రతి ఒక్కరు ఖండించాలని, ఉగ్రవాదం దేశాన్ని అస్థిర పర్చేటమేనని వెంకటేశ్వరరావు అన్నారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు బడుగు శ్రీకాంత్, ప్రధాన కార్యదర్శి మక్కిన శివ సుబ్రహ్మణ్యం, లంక వెంకటేశ్వరరావు, ఆచంట కోటిబాబు, ఈడే వాసు, ఏమినేని వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

లారీ ట్రాన్స్‌పోర్టు కార్యాలయంపై దాడి

గుడివాడ, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : మార్కెట్ యార్డు సమీపంలోని టీడీపీ నాయకుడు అడుసుమిల్లి శ్రీనివాస్‌కు చెందిన లారీ ట్రాన్స్‌పోర్టు కార్యాలయంపై గురువారం అర్ధరాత్రి మున్సిపల్ టీడీపీ మాజీ ఫ్లోర్ లీడర్ లింగం ప్రసాద్ తమ్ముడు లింగం చిట్టిబాబు తన అనుచరులతో దాడి చేసి ఫర్నీచర్, సీసీ కెమెరాలను ధ్వంసం చేసినట్లు కేసు నమోదైంది. ముందుగా కార్యాలయ చుట్టుపక్కల 20 అడుగులు ఎత్తున ఉన్న సీసీ కెమెరాలను పగలకొట్టారు. కార్యాలయం సిబ్బంది, స్థానికులను చంపేస్తామంటూ లింగం చిట్టిబాబు అనుచరులు బెదిరించినట్లు స్థానికులు తెలిపారు. దాడికి పాల్పడిన వారిని పోలీసులు వదిలేయడం వివాదాస్పదమైంది. దాడికి పాల్పడిన వారిని పోలీసులు వదిలేసారని అడుసుమిల్లి ఆరోపించారు. కార్యాలయం తలుపులను పగలకొట్టి రూ.3 లక్షల నగదు, సీసీ కెమెరా హార్డ్ డిస్క్‌లు, విలువైన వస్తువులను ఎత్తుకెళ్లా రని ట్రాన్స్ పోర్టు నిర్వాహకులు అడుసుమిల్లి శ్రీనివాస్ తెలిపారు. శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టూటౌన్ సీఐ సి.హెచ్ నాగప్రసాద్ తెలిపారు.

కృష్ణా వర్సిటీకి భారతదేశ జాతీయ స్థాయి అవార్డు

మచిలీపట్నం టౌన్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): కృష్ణా విశ్వవిద్యాలయానికి ప్రతిష్ఠాత్మకమైన జాతీయ స్థాయి అవార్డు దక్కింది విశ్వవిద్యాలయాల పనితీరు ఆధారంగా కృష్ణా విశ్వవిద్యాలయం మూడో స్థానంలో నిలవడం విశేషం. న్యూఢిల్లీలోని హోటల్ గ్రాండ్‌లో జరిగిన కార్యక్రమంలో విశ్వవిద్యాలయ రెక్టార్ ఎం.వి. బసవేశ్వరరావు, భారత క్రికెట్ కంట్రోల్ బోర్డు సభ్యుడు జతీన్ పరాన్ జపే చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. శాస్త్ర సాంకేతిక రంగాల్లో భారతదేశం సాధిస్తున్న విజయాలు, పొందుతున్న ఫలితాలపై కృష్ణావిశ్వవిద్యాలయం రెక్టార్ బసవేశ్వరరావు జాతీయ స్థాయి సమ్మేళనంలో ప్రసంగించారు.